PRGI Reg No -"APTEL/26/A1193

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక




ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 42, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, గురువారం - 02- ఏప్రిల్ - 2026 , వెల రూ.5/-

## మేం రాజకీయాలు చేయడం లేదు...
## మేం కోరేది ఒక్కటే: పురందేశ్వరి



➤ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతి శాశ్వతంగా నిలవాలి

## అమరావతి చట్టబద్ధత బిల్లుకు తెలంగాణ బీజేపీ మద్దతు: కిషన్ రెడ్డి



- అమరావతి చట్టబద్ధతపై లోక్ సభలో చర్చ
- సుదీర్ఘ పోరాటం తర్వాత తెలంగాణ ఏర్పడింది
- కేంద్రంలోని కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ సాధించాం

## కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టు నోటీసులు..
## నిర్దోషిగా తేల్చడాన్ని సవాలు చేసిన ఈడీ



### కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో మరోసారి ఎదురుదెబ్బ

ఢిల్లీ: ఢిల్లీ ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. ఈడీ జారీ చేసిన సమన్లకు ఆయన మిగతా.. 2లో



## అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్ సభ ఆమోదం...

- నేడు రాజ్యసభ ముందుకు బిల్లు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ 'ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం సవరణ బిల్లు-2026'ను సభలో ప్రవేశపెట్టారు
- తెలుగుదేశం, బీజేపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీలు బిల్లుకు మద్దతు పలకగా, వైసీపీ ఎంపీలు చర్చ మధ్యలో సభ నుంచి వాకౌట్
- ఈ చట్ట సవరణతో రాష్ట్రానికి అమరావతి ఏకైక రాజధానిగా చట్టపరమైన భద్రత
- "అమరావతి రైతుల కన్నీళ్ల మీద ఈ చట్టం నిర్మాణమైంది. ఇది ఆంధ్ర ప్రజల కలల రాజధాని"

## హిట్ అండ్ రన్ నేరాల కంటే ఘోరంగా
# ఓ పార్టీ రాజకీయాలు చేస్తోంది
### కళ్లార్పకుండా అసత్యాలు ప్రచారం చేస్తోంది

- ★పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం రూ.1300 కోట్లు అడ్వాన్స్‌గా ఇచ్చింది
- ★గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం
- ★ప్రతిపక్షం చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దు
- ★జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ విషయంలో వైసీపీ అసత్యాలు ప్రచారం చేస్తోంది
- ★అభివృద్ధి, పెట్టుబడులే లక్ష్యం
- ★సుపరిపాలన - చేనేతలకు వరం



అమరావతి: వైసీపీ తీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు పరోక్షంగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హిట్ అండ్ రన్ నేరాల కంటే ఘోరంగా ఓ పార్టీ రాజకీయాలు చేస్తోందని, కళ్లార్పకుండా అసత్యాలు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. నెల్లూరు జిల్లా మిగతా.. 2లో



## అమరావతిపై చంద్రబాబుది డ్రామా..
# ఇదే మా ప్లాన్ బీ

అమరావతి.. అవినీతి రాజధాని

'ప్లాన్ బి' పేరుతో 'మావిగన్' అనే కొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు

మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు నగరాలను కలుపుతూ ఈ రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేయవచ్చు

అమరావతిలో కేవలం రోడ్లు, కరెంట్, డ్రైనేజీ వంటి కనీస వసతులకే ఎకరానికి రూ.2 కోట్లు ఖర్చవుతుంది

ఈ లెక్కన 50,000 ఎకరాలకు రూ.1 లక్ష కోట్లు, లక్ష ఎకరాలకు రూ.2 లక్షల కోట్లు అవసరమవుతాయి

అమరావతి: అమరావతి రాజధాని నిర్మాణంపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అమరావతిని రూ. 2 లక్షల కోట్ల భారీ ఆర్థిక కుంభకోణంగా అభివర్ణించిన మిగతా.. 2లో



## వచ్చే మూడేళ్లలో మహిళా సంఘాలకు
# రూ.లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు

- ▶▶ఎన్ని సవాళ్లు ఎదురైనా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసి చూపుతుంది
- ▶▶290 కోట్ల ప్రయాణాలతో మహిళలు ఆదా చేసుకున్న మొత్తం రూ.10 వేల కోట్లు
- ▶▶వచ్చే మూడేళ్లలో మహిళా సంఘాలకు రూ.లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చే దిశగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది
- ▶▶ఈ లక్ష్య సాధనలో సంవత్సరానికి రూ.20 వేల కోట్లు ఇచ్చే దిశలో ఇప్పటికే రూ.57 వేల కోట్లను అందజేసినట్లు వెల్లడి


హైదరాబాద్: ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ ఎన్ని సవాళ్లు ఎదురైనా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసి చూపుతుందని, దానికి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకమే నిదర్శనమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు మిగతా.. 2లో

# ప్రధాని మోదీ, కేరళ సీఎం విజయన్‌కు తేడా ఏమీ లేదు
### బీజేపీ ఓటు బ్యాంకు విజయన్‌కు బదిలీ అయ్యేలా మోదీ ప్రయత్నిస్తున్నారు

- ★కేరళలో ప్రచారంలో రేవంత్ రెడ్డి
- ★కేరళ ప్రజలు చాలా తెలివైనవారని, విద్యావంతులను, మతతత్వ శక్తులను అస్సలు అనుమతించరు
- ★బీజేపీ లాంటి పార్టీలు అధికారంలోకి రాకుండా కేరళ ప్రజలు లక్ష్మణ రేఖ గీశారు
- ★కేరళకు భవిష్యత్తు లేకుండా చేయాలని మోదీ, పినరయి విజయన్ చూస్తున్నారు
- ★కేరళలో పినరయి విజయన్ సమయం అయిపోయిందని, యూడీఎఫ్ సమయం వచ్చింది
- ★ఎన్నికల తర్వాత ఇక్కడ పాలించేది కాంగ్రెస్ పార్టీయేనని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేది తమ పార్టీయే



హైదరాబాద్: కేరళలో బీజేపీ ఓటు బ్యాంకు సీఎం పినరయి విజయన్‌కు బదిలీ అయ్యేలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రయత్నిస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన కేరళ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. తిరువనంతపురంలోని ఎస్ఎం లాక్ జంక్షన్ నుంచి ముట్టతార వరకు రోడ్ షోలో పాల్గొని ప్రసంగించారు. ప్రధాని మోదీ, కేరళ సీఎం విజయన్‌కు తేడా ఏమీ లేదని ఆయన విమర్శించారు. కేరళ ప్రజలు చాలా తెలివైనవారని, విద్యావంతులను, మిగతా.. 2లో



## ఒకే ఒక రాజధాని...
## అమరావతికి ఇక తిరుగులేదు

- ★స్వర్ణాంధ్ర నిర్మాణంలో ఇది ఒక కీలక మైలురాయి.
- ★ఇది ఆంధ్రుల ఆత్మగౌరవానికి, ప్రజల ఆకాంక్షలకు లభించిన గౌరవం
- ★ఈ చారిత్రాత్మక పరిణామంతో రాజధాని భవిష్యత్తుపై నెలకొన్న సందిగ్ధతకు శాశ్వతంగా తెరపడిందని స్పష్టం
- ★గత ప్రభుత్వ పాలనలో ఎదురైన చీకట్లు తొలగిపోయాయి

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. మిగతా.. 2లో

## ఆయనకు ఒక్క తెలుగు ఎంపీ అయినా మద్దతివ్వకపోవడం ఈ గడ్డ చేసుకున్న దౌర్భాగ్యం
### ప్రధాని మోదీ చేతిలో కీలుబొమ్మలుగా, బీజేపీకి బానిసలుగా మారారు

ఎంపీలంతా తమ పదవులకు తక్షణమే రాజీనామా చేయాలి

రాష్ట్రానికి జీవన్మరణ సమస్య అయిన ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనలో ఎంపీలు పూర్తిగా విఫలమయ్యారు

ఆయన మాట్లాడుతున్నప్పుడు రాష్ట్రం నుంచి గెలిచిన ఒక్క ఎంపీ కూడా మద్దతుగా నిలబడకపోవడం తెలుగుగడ్డ చేసుకున్న దౌర్భాగ్యం



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఎంపీలపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రానికి జీవన్మరణ సమస్య అయిన ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనలో ఎంపీలు పూర్తిగా విఫలమయ్యారని, మిగతా.. 2లో

## హైదరాబాద్‌లో
# 'హైడ్రా' కొరడా..

- రూ.100 కోట్ల ప్రభుత్వ భూమికి విముక్తి
- భారీ భద్రత నడుమ ఈ కూల్చివేత ప్రక్రియను పూర్తిచేశారు
- హుడా (హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఆమోదించిన 188 ఎకరాల లేఅవుట్‌లో 6,500 చదరపు గజాల స్థలాన్ని ఆటస్థలం కోసం
- ఐదు జీ+3 భవనాలతో పాటు మరో రెండు చిన్న నిర్మాణాలను కూడా




హైడ్రా బృందాలు నేలమట్టం చేశాయి

- చెరువులు, పార్కులు, ప్రభుత్వ భూములను కాపాడేందుకు 2024లో తెలంగాణ ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు

# నేడు రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు




ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహణ

గ్రామ పంచాయతీలకు రూ.619 కోట్లు విడుదల

గ్రామ సమస్యలను సమగ్రంగా గుర్తించి, వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నాం

ప్రతి గ్రామసభలో విధిగా ఫిర్యాదు బాక్సులను ఏర్పాటు చేసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తాం

హైదరాబాద్: ప్రభుత్వ ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా 12,760 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించనున్నారు. సర్పంచులు, మిగతా.. 2లో

3

నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

జనరల్ న్యూస్

గురువారం - 02 - ఏప్రిల్ - 2026

## బాబు బాబు జగ్జీవన్ రామ్ కి భారతరత్న ప్రకటించాలి

### -మదర్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ మల్లాది ప్రసాదరావు



రెడ్డిగూడెం, ఎన్టీఆర్ జిల్లా:భారతదేశానికి విశిష్ట సేవలు అందించిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక న్యాయం కోసం అహర్నిశలు కృషి చేసిన సమతా వాది, మహానేత బాబు జగజీవన్ రామ్ కి దేశ అత్యున్నత పౌర పురస్కారం "భారతరత్న" ప్రకటించాలని మదర్ సర్వీస్ సొసైటీ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మల్లాది ప్రసాదరావు కేంద్ర ప్రభుత్వానికి పత్రిక ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూకేంద్రమంత్రిగా,ఉప ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన ముఖ్యంగా అణగారిన వర్గాల అభ్యున్నతికి అంకితభావంతో దేశానికి ఎనలేని సేవలో అందించారని ఆయన కొనియాడారు. సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలను బలపరచడంలో జగ్జీవన్ రామ్ చేసిన సేవలు అపూర్వం అని ఆయన సేవలను కొనియాడారు.ఇలాంటి మహనీయుడికి ఇప్పటివరకు భారతరత్న ప్రకటించకపోవడం చాలా బాధాకరం అని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. జగ్జీవన్ రామ్ సేవలను గుర్తించి తక్షణమే భారత ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని డాక్టర్ మల్లాది ప్రసాదరావు విజ్ఞప్తి చేశారు.మహానేతల సేవలను గౌరవించడం ద్వారా సమాజానికి స్ఫూర్తి కలిగించవచ్చని, బాబు జగ్జీవన్ రామ్ కి భారతరత్న ఇవ్వడం సమాజానికి ఒక గొప్ప సందేశమని సామాజిక కార్యకర్త డాక్టర్ మల్లాది ప్రసాదరావు పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం బాబు జగజ్జీవన్ రావు కి భారతరత్న ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

## అపరాల రైతులు ఆందోళన

**- కొనుగోలు నిబంధనల పట్ల రైతులు ఆగ్రహం**

**- రైతుల నుండి పెసర, మినుములు వెంటనే కొనుగోలు చేయాలి**

**- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ డిమాండ్**



ఏలూరు, నేటి శుభోదయ ::: అపరాలు కొనుగోలు నిబంధనల పట్ల, కొనుగోలు ఆలస్యం పట్ల బుధవారం ఏలూరు శివారు సుంకరివారితోట రైతు సేవా కేంద్రం వద్ద అపరాల రైతులు ఆందోళన చేశారు. అధికారుల తీరు పట్ల ఆగ్రహం చేశారు. రైతు సేవా కేంద్రం వద్దకు తీసుకువచ్చిన పంట రోజులు తరబడి ఇక్కడే ఉండిపోవడం వలన ఆ పంటను కాపలాకు రాత్రులు,పగలు ఇక్కడే పడిగాపులు పడాల్సి వస్తోందని, రైతుల ఇబ్బందులు అర్థం చేసుకోకుండా అధికార యంత్రాంగం వ్యవహరిస్తోందని అపరాల రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రం ముందు ధర్నా నిర్వహించి ఆందోళన చేపట్టారు. రైతు సేవా కేంద్రం వద్దకు తీసుకు వచ్చిన పంటను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ పరిశీలించారు. అనంతరం అక్కడికి వచ్చిన మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ తో సంప్రదింపులు జరుపగా పెసర పంటను వెంటనే గోడౌన్స్ కు తరలిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కె. శ్రీనివాస్ మాట్లాడుతూ ఒకవైపు కొనుగోలు టార్గెట్ పూర్తయిందని గత కొన్ని రోజులుగా కొనుగోలు నిలిపివేయడంతో అపరాల రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రైతులు పండించిన పెసర,మినుము పంటలను పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు నిబంధనలతో రైతులను ఇబ్బందులు గురి చేయడం తగదన్నారు. ఇప్పటికే తగిన దిగుబడులు రాక, పెట్టుబడి ఖర్చులు పెరిగిపోయి అపరాల రైతులు నష్టపోయారని చెప్పారు. అపరాల కొనుగోలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## ఇళ్లు కాలిపోయి నిరాశ్రులైన బాధిత కుటుంబాలను పరామర్శించిన జ్యోతుల నవీన్

**శ్రీ జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా నీడ కోల్పోయిన బాధితులకు త్వరతగతిన ఇంటి షెడ్ ఏర్పాటుకు శ్రీకారం**



గోకవరం-నేటిసుబోదయ.:విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో సర్వం కోల్పోయిన గోకవరం మండలం రంప యర్రంపాలెం బాధితులను కాకినాడ జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ పరామర్శించారు. బుధవారం గ్రామంలోని గంగా భవాని నగర్ శివారు లో కుంజాల రఘుపతి, కూతేటి దుర్గారావు కుటుంబాలను పరామర్శించి వారికి బాసటగా నిలిచారు. ప్రభుత్వం ద్వారా ఇల్లు నిర్మించుకోవడానికి సమయం పడుతున్నందున నివాసము ఉండుటకు తక్షణమే రేకుల షెడ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా ఒక షెడ్ నిర్మించడానికి బాధ్యతలను స్థానిక టిడిపి సీనియర్ నాయకులు సూరంపాలెం ప్రాజెక్టు చైర్మన్ ఉంగరాల రాముకు అప్పగించారు. మరొక షెడ్డు నిర్మాణాన్ని శ్రీ లక్ష్మీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఉంగరాల గణేష్ కు, మరి కొంతమంది దాతలకు ఆదేశించారు. అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోవడంలో గ్రామంలోని కొంతమంది దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అగ్నిప్రమాదంలో కాలిపోయిన రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, హాల్ టికెట్, వికలాంగురాలు ఈ యొక్క సదరన్ సర్టిఫికెట్లు త్వరగా అందజేయాలని స్థానిక తహశీల్దార్ రామకృష్ణకు ,ఎంపీడీవో గోవింద్ కు ఆదేశించారు .అగ్ని బాధితులకు పార్టీ నాయకులు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.అనంతరం రంప యర్రంపాలెం హై స్కూల్ నందు మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి




,పౌష్టికాహారం పై ఆరా తీశారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పిల్లా చంటిబాబు, మండల ప్రధాన కార్యదర్శి గునిపే భరత్,ఉంగరాల గణేష్, సత్యం పెద్దబ్బులు,సర్పంచ్ బాదంపూడి హర్షిత ప్రకాష్, తిరుమలాయపాలెం గ్రామ సర్పంచ్ పురంసెట్టి శివాజీ, మాజీ జెడ్పిటిసి పాలూరి బోసి బాబు,తంటికొండ దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్న దొర, దాసరి సీతారామకృష్ణ, మలిరెడ్డి సిరి,మండిగ గంగాధర్, గళ్ళ రాము,పోసిన ప్రసాద్,ఆచంట రాజు, పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితులకు వైఎస్ఆర్సిపి సహాయం



గోకవరం -నేటిసుబోదయ. :రంప ఎర్రంపాలెం గ్రామంలో గత రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులను రంప ఎర్రంపాలెం గ్రామ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దంగేటి వెంకటరత్నం ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ వైఎస్ఆర్సిపి గ్రామ గౌరవ అధ్యక్షులు తోట్టా సత్యనారాయణ, ఉపసర్పంచ్ దాకారపు ధర్మరాజు,పాటి అప్పలరాజు, గండికోట రామకృష్ణ సమక్షంలో బుధవారం బాధితులను పరామర్శించి 15 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. బాధితులకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మరింత అండగా ఉంటుందని తెలిపారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తిన రామస్వామి, పాటి సత్తిబాబు,పాలిక వెంకట రమణ, పాలిక కుమార్, కడవల వీరపండు, తలారి కాటమస్వామి,



గంటా. వెంకట రత్నం,రాజుబాబు, గంటా బులి వేంకటేసులు, అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించిన వారిలో ఉన్నారు.

# అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**- నేడు రాజ్యసభకు**

**- రాష్ట్రపతి ఆమోదం తర్వాత గెజిట్ నోటిఫికేషన్**

న్యూఢిల్లీ, నేటి శుభోదయ ::: ( మాధవరావు యెగినాటి, "నేటి శుభోదయ" (న్యూఢిల్లీ ప్రతినిధి) ::: ఆంధ్రుల కల అయిన రాజధాని అమరావతికి చట్టబద్ధ హామీలో కీలక ముందడుగు పడింది. ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు పార్లమెంట్ ముందుకు వచ్చింది. 2024 జూన్ 2 నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని ప్రకటిస్తూ విభజన చట్టం-2014లోని సెక్షన్ 5(2)కి సవరణ చేస్తూ కేంద్ర హోం శాఖ రూపొందించిన బిల్లును ఆ శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. సుమారు 2 గంటలపాటు చర్చ తర్వాత అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. టీడీపీ, బీజేపీ, జనసేన, కాంగ్రెస్, వైఎస్సార్సీపీ, సమాజ్‌వాదీ సహా పలు పార్టీల ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. అనంతరం బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ స్థానంలో ఉన్న తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించారు. ఈ బిల్లు నేడు గురువారం రాజ్యసభ ముందుకు రానుంది. ఆ తర్వాత కేంద్ర కేబినెట్ పోస్ట్ ఫ్యాక్టో ర్యాటిఫికేషన్ చేసి అనంతరం రాష్ట్రపతి ఆమోదానికి పంపనుంది. రాష్ట్రపతి ఆమోదం అనంతరం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనుంది.

### అమరావతిని శాశ్వత రాజధానిగా ఉంచాలి

ఏపీ రాజధానిగా అమరావతి శాశ్వతంగా ఉంటుందా అన్న అనుమానానికి ఈ చట్టసవరణ ముగింపు పలుకుతుందని బిల్లుపై చర్చలో ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. అమరావతికి చట్టబద్ధత ఇచ్చేందుకు అంగీకరించిన ప్రధాని మోదీకి, అమిత్‌షాకు కృతజ్ఞతలు తెలిపారు. అమరావతి అనేది చంద్రబాబు ఆశయం, కల, ధ్యేయమని పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. కూటమి ఐక్యతకు కంకణబద్ధుడైన వ్యక్తి పవన్‌కల్యాణ్ అని కొనియాడారు. జగన్ అణచివేత వల్లే అమరావతి ఒక ఉద్యమంగా మారి దేశాన్ని ఆకర్షించిందని పెమ్మసాని తెలిపారు. రాష్ట్రాభివృద్ధిలో రాజధాని కీలక పాత్ర పోషిస్తుందని, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ ఆయా రాష్ట్రాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. అమరావతి ఏపీ ఆర్థిక అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర రాజధాని నిర్ణయం, మార్పు కేంద్రం పరిధిలోనే ఉంటుందని 2022లో సుప్రీంకోర్టు చెప్పిందని పెమ్మసాని చంద్రశేఖర్ పునరుద్ఘాటించారు.అమరావతి చట్టబద్ధత బిల్లుకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. పార్లమెంటులో చర్చ సందర్భంగా మాట్లాడిన కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ అమరావతి చట్టబద్ధతకు మద్దతిస్తున్నట్లు ప్రకటించారు. అమరావతికి తగినన్ని నిధులు అందించి ప్రపంచస్థాయి రాజధానిగా నిర్మించేలా కేంద్రం సహకరించాలని కోరారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామన్న హామీ ఇంకా పెండింగ్‌లోనే ఉందని మాణికం ఠాగూర్ అన్నారు. మిగిలిన హామీలన్నీ అమలు చేసి విభజనతో నష్టపోయిన ఏపీని ఆదుకోవాలని కోరారు.

### తప్పనిసరి పరిస్థితుల్లో రాజధాని ఏర్పడింది

రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లుకు జనసేన పార్టీ పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ ఎంపీ వల్లభనేని బాలశౌరి లోక్‌సభలో ప్రకటించారు. రాజధాని విషయంలో గత ప్రభుత్వం చాలా ఇబ్బందులు తెచ్చిందని గుర్తుచేసిన బాలశౌరి ప్రజల పూర్తి మద్దతున్న అమరావతిని శాశ్వత రాజధానిగా ఉంచాలని కోరారు. దేశం మొత్తం రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లుకు మద్దతు తెలిపితే వైఎస్సార్సీపీ మాత్రం వ్యతిరేకించడం దురదృష్టకరమని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మండిపడ్డారు. అమరావతికి చట్టబద్ధత బిల్లు సందర్భంగా లోక్‌సభలో కలిశెట్టి మాట్లాడారు. వైఎస్సార్సీపీ ఎంపీలు సభ నుంచి వాకౌట్ చేసి రైతుల త్యాగాలను అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.అసంబద్ధంగా జరిగిన విభజన వల్ల నవ్యాంధ్రప్రదేశ్‌కు తప్పనిసరి పరిస్థితుల్లో అమరావతి రాజధానిగా ఏర్పడిందని బీజేపీ ఎంపీ పురందేశ్వరి అన్నారు. అలాంటి రాజధానిని వైఎస్సార్సీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు అనిశ్చితిలోకి నెట్టేశాయని ఆక్షేపించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన బిల్లు-2014 పార్లమెంటు ఆమోదం పొందిందని పురందేశ్వరి గుర్తేచేశారు. కాబట్టి రాజధాని మార్పు విషయం కూడా పార్లమెంటు ఆమోదం పొందాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. రాజధాని విషయంలో మరో రాష్ట్రానికి ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఉండేందుకు అమరావతికి చట్టబద్ధత బిల్లు చట్టరూపం దాల్చాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

### ఇక మూడు ముక్కలాటలు సాగబోవు

అమరావతి చట్టబద్ధత చట్టంతో ఆంధ్రప్రదేశ్‌లో ఇక మూడు ముక్కలాటలు సాగబోవని బీజేపీ ఎంపీ సీఎం రమేష్ ఉద్ఘాటించారు. పార్లమెంటులో అమరావతికి చట్టబద్ధత బిల్లు ప్రవేశపెట్టాక చర్చలో భాగంగా ఆయన మాట్లాడారు. రాజధాని అనేది కొన్ని నిర్మాణాల సముదాయమో, ఒక నగరమో కాదని సీఎం రమేష్ అన్నారు. అమరావతి తెలుగు ప్రజల గుండె చప్పుడని స్పష్టం చేశారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో అమరావతిని నాశనం చేయడానికే పూనుకుని అదే పనిగా దుశ్చర్యలకు పాల్పడిందని ఎండగట్టారు. ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే 30 ఏళ్లు ఎన్డీఏ కూటమి పాలనే ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఇక ఎవరూ రాజధాని అమరావతిని ఇంచు కూడా కదల్చలేరని కుండబద్దలు కొట్టారు.

### - అమరావతి బిల్లుకు వైఎస్సార్సీపీ వ్యతిరేకం

అమరావతికి వ్యతిరేకం కాదంటూనే చట్టబద్ధత బిల్లును వైఎస్సార్సీపీ వ్యతిరేకించింది. ప్రస్తుత స్థితిలో ఉన్న బిల్లును వ్యతిరేకిస్తున్నామంటూ వైఎస్సార్సీపీ ఎంపీలు లోక్‌సభ నుంచి వాకౌట్ చేశారు. అమరావతి చట్టబద్ధత బిల్లుతో ప్రజలకు ఒరిగేదేమీ లేదని ఎంపీ మిథున్‌రెడ్డి విమర్శించారు. అమరావతి పేరుతో హడావుడిగా బిల్లు తెచ్చేస్తే సరిపోదని రైతులకు ఇచ్చిన హామీలు ఎప్పుడు నెరవేరుస్తారో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు.

## నియోజకవర్గంలోని తంగేడు కుంట ప్రాంతంలో 3వ రిజర్వాయర్ ఏర్పాటుకు పరిశీలన చేయండి

**- హంద్రీనీవా సుజల స్రవంతి 9వ ప్యాకేజీలో కాల్వకు భూమి కోల్పోయిన రైతులకు భూ పరిహారం చెల్లించండి**

**- నియోజకవర్గం లో రైతులను మల్బరీ సాగు వైపు దృష్టి మళ్లించండి**

**బుక్కపట్నం చెరువు కింద ముంపు బాధితులకు నష్టపరిహారంతోపాటు కోల్పోయిన భూమికి బదులు అదనంగా భూమి కేటాయించాలని కోరిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**




పుట్టపర్తి, నేటి శుభోదయ ::: సత్యసాయి జిల్లా కలెక్టరేట్ లో బుధవారం ఏర్పాటు చేసిన జిల్లా సమీక్షా సమావేశంలో పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తోపాటు మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవితమ్మ సత్య కుమార్ యాదవ్,ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు,కందికుంట వెంకటప్రసాద్, జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్,ఎస్పీ సతీష్ కుమార్,జాయింట్ కలెక్టర్ మంత్రి మౌర్య భరద్వాజ్ ,ధర్మవరం నియోజవర్గ టీడీపీ ఇన్ ఛార్జ్ పరిటాల శ్రీరామ్ , డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్ ఇరిగేషన్ డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్ ఇతర డైరెక్టర్లు లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ పుట్టపర్తి నియోజవర్గం లో 193 చెరువులను ,2 రిజర్వాయర్లను హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలను నింపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరిక మేరకు పనులు వేగవంతం అయ్యేలా చూడాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. నియోజకవర్గంలో పుట్టపర్తి మండలం గాజులపల్లి, నల్లమాడ మండలం నల్లగొండ రిజర్వాయర్లు ఏర్పాటు చేసేలా ఇరిగేషన్ అధికారులు అంచనాల వేశారన్నారు. వీటికి అదనంగా మూడవ రిజర్వాయర్ ఓడి చెరువు మండలం తంగేడు కుంట పంచాయతీలో మద్దకవారి పల్లిలో ఏర్పాటు చేసేలా ఇరిగేషన్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేకంగా కోరారు.వీటిపై ఇరిగేషన్ ఇంజనీర్లు క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగు ప్రతిపాదనలు సిద్ధం చేసేలా చర్యలు తీసుకోవాలని ఇన్ ఛార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్,జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ,ఇరిగేషన్ అధికారులకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సూచించారు.పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు పెద్ద కమ్మవారిపల్లి వద్ద హంద్రీనీవా సుగల స్రవంతి తొమ్మిదవ ప్యాకేజీలో కాలువకు భూములు కోల్పోయిన రైతులకు ఇప్పటివరకు పరిహారం చెల్లించకపోగా అధికారులు స్పందనలేని సమాధానాలు చెబుతున్నారని. హంద్రీనీవా 9వ ప్యాకేజీలో ఇంకా ఎంతమంది రైతులకు పరిహారం చెల్లించాలి ఇప్పటివరకు చెల్లించలేక పోవడానికి గల కారణాలను అధికారులు సమగ్ర విచారణ జరిపి రైతులకు పరిహారం అందే విధంగా చేయాలని ఇన్చార్జ్ మంత్రి అనగానే సత్యప్రసాద్ కి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా బుక్కపట్నం చెరువు కింద ముంపు రైతులకు తగిన పరిహారంతో పాటు కోల్పోతున్న భూమిని ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం మంజూరు చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఇన్చార్జి మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అదేవిధంగా చిన్న నీటిపారుదల చెరువులను హంద్రీనీవా నీటితో పూర్తిగా నింపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అందులో భాగంగా వాటికి మరమ్మతులు చేపట్టి చెరువుల గట్లను పటిష్టం చేయాలని కోరారు. గ్రామాల్లో త్రాగునీటి ఎద్దడి రాకుండా ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు ముందస్తుగా అలాంటి గ్రామాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు వాటికి సంబంధించిన ప్రభుత్వ రాయితీ పథకాలు ఏవి ప్రజలకు తెలియడం లేదని వాటిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కోరారు. హిందూపురం మడకశిర ప్రాంతాల్లో మల్బరీ పంటలు ఎక్కువగా సాగు చేస్తున్నారని నియోజవర్గం లో మల్బరీ సాగు విస్తీర్ణం బాగా తగ్గిందని గుర్తు చేశారు. మల్బరీ పంట వైపు రైతులను దృష్టి మళ్ళిస్తే మంచి లాభదాయకంగా ఉంటుందని అటువైపు రైతులను దృష్టి సాదించేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. గ్రామంలో గడ్డి కొరత ఎక్కువగా ఉందని వాటి పరిష్కారం కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పశువర్ధక శాఖ అధికారులకు సూచించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గంలోని అన్ని చెరువులను నీళ్ల ఇస్తే గ్రామాల్లో ఉన్న బోర్లు నీటిమట్టం పెరిగి త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. అదేవిధంగా ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తినీ పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం డిపిఆర్ ప్రాజెక్టును తయారు చేసిందని అందుకు తగిన చర్యలు తీసుకొని పుట్టపర్తి బుక్కపట్నం కొత్తచెరువు మూడు మండలాలను కలుపుతూ పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే పల్లె సింధూర కోరారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా అంతరంగానికి తగిన ఆదేశాలు ఇచ్చారని ఆ దిశగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రాబోయే రోజుల్లో అమరావతిని ఎవరూ టచ్ చేయలేరు

**- సీఎం నారా చంద్రబాబు నాయుడు**




అమరావతి, నెల్లూరు, నేటి శుభోదయ ::: ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లుకు బుధవారం లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఏపీ పునర్విభజన చట్ట సవరణ పేరుతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అనంతరం సుమారు రెండు గంటలపాటు దీనిపై చర్చ జరిగింది. టీడీపీ, బీజేపీ, జనసేన, కాంగ్రెస్, వైఎస్సార్సీపీ, సమాజ్‌వాదీ సహా పలు పార్టీల ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. అనంతరం బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ స్థానంలో ఉన్న తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించారు. ఈ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు రానుంది.అమరావతికి చట్టబద్ధత బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టడం ఒక చరిత్ర అని సీఎం చంద్రబాబు అన్నారు. రాబోయే రోజుల్లో అమరావతిని ఎవరూ టచ్ చేయలేరన్నారు. అమరావతిని ఇంచు కూడా కదిలించలేరు. ఏపీకి ఏకైక రాజధానిగా అమరావతి ఉంటుందని సీఎం పేర్కొన్నారు. బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నెల్లూరు జిల్లా వింజమూరులో పర్యటించారు. లబ్ధిదారులకు ఆయన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు.అనంతరం బహిరంగ సభలో ప్రసంగించారు. స్వర్ణాంధ్రకు ఆరు సూత్రాలతో ముందుకు వెళ్తున్నామన్నారు. గత 5 ఏళ్లు అరాచక, విధ్వంస పాలన సాగిందని అన్నారు. "నా జీవితంలో ఇలాంటి వ్యక్తిని, పార్టీని చూడలేదు. వైఎస్సార్సీపీది మూడు ముక్కలాట, మూడు రాజధానులు నినాదం, ప్రత్యేక శాసనసభ ఏర్పాటు పెడితే కనీసం అసెంబ్లీకి కూడా రాలేదు. మాది వైఎస్సార్సీపీ అని చెప్పుకునేందుకు ఆ పార్టీ నేతలు సిగ్గు పడాలి" అని సీఎం చంద్రబాబు జగన్‌పై మండిపడ్డారు. రాజధాని మీద దుష్ప్రచారం చేశారన్నారు. ముంపు ప్రాంతం, శ్మశానం అంటూ హేళన చేశారని సీఎం అన్నారు. దేశంలో ఎక్కడా ఇవ్వని విధంగా పింఛన్లు పెంచి ఇస్తున్నామని పేర్కొన్నారు. నెలకు రూ.2730 కోట్లు ఖర్చు పెడుతున్నామని వెల్లడించారు. ఇప్పటికే రూ.60 వేల కోట్లు పింఛను కింద అందించామని చెప్పారు. స్టూడెంట్స్ స్కూల్‌కి వెళ్లేలోపు తల్లుల అకౌంట్‌లో డబ్బులు వేస్తున్నామన్నారు. గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరం పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. శ్రీశైలం, పోలవరం వాటర్ ఉదయగిరికి కూడా వస్తాయి. ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు పి4 ను తీసుకొచ్చామని, 25 వేల కుటుంబాలను దత్తత తీసుకునేందుకు అదానీ సిద్ధంగా ఉన్నారని సీఎం అన్నారు.వింజమూరులో ఏర్పాటు చేసిన డీఆర్డీఓ రక్షణ ఉత్పత్తుల స్టాల్ ను సీఎం పరిశీలించారు. సూక్ష్మ సేద్యం ద్వారా పండించిన పామాయిల్, జొన్న, బొప్పాయి తదితర పంటలకు సంబంధించిన స్టాళ్లను సందర్శించారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సీఎం చంద్రబాబుతో పాటు మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేశ్, మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## కేంద్రం ప్రభుత్వం తీసుకుని వచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేయాలి




నేటి శుభోదయ చిత్తూరు జిల్లా నగరి,: కార్మికుల పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను అమలు పరచాలి................. ఏ ఐ టి యు సి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్

ఈరోజు దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని కోరుతూ ఈరోజు దేశవ్యాప్తంగా బ్లాక్ డే గా నిర్వహించాలని ఏఐటియుసి కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు నగరిలో కూడా ఏ ఐ టి యు సి ఆధ్వర్యంలో సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి వేలన్ ఏఐటీయూసీ నాయకులు మురళి అధ్యక్షతన అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం కార్పొరేటర్ శక్తులకు అనుకూలంగా తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ వల్ల కార్మికులు అనేక నష్టాలు గురి అవుతారు . భారతదేశ కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బ్రిటిష్ కాలం నుంచి అనేక పోరాటాలు చేసి ప్రాణ త్యాగం చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను ఈరోజు కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు దాసోహం అయ్యి కార్మికుల హక్కులను కాలరాస్తూ ఈ లేబర్ కోడ్స్ ను తేవడం జరిగింది. దీనివలన కార్మికులకు ఉద్యోగ భద్రత ,వేతనాలు పెంపు చట్టం,, బోనస్ చట్టం ఈఎస్ఐ చట్టం గ్రాజువటీ చట్టం వేతనాలు కోసం ఉద్యోగ భద్రత కోసం జరిగే సమ్మెలో నిషేధించబడతాయి యూనియన్లు పెట్టుకోవాలన్నా పూర్తిగా నిషేధించబడతాయి కార్మికులు బానిసల్లంగా మార్చే ఈ లేబర్ కోడ్స్ రద్దు చేయాలని లేని పక్షంలో కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తామని , కేంద్రానికి మద్దతు తెలియపరుస్తున్న రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం కార్మికుల కు పని గంటలు పెంచడం రాత్రుల్లో షాపులు ఓపెన్ చేసి మహిళా కార్మికులు కూడా నైట్ డ్యూటీలు చేయడానికి సమర్థించడం దుర్మార్గ చర్య , పట్టపోగలే మహిళలకు భద్రత కరువు అవుతున్న సందర్భంగా వారికి భద్రత ఎవరు కనిపిస్తారని డిమాండ్ చేస్తున్నా ం ఎప్పటికైనా కేంద్ర ప్రభుత్వం డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి వేలన్ ఏఐటీయూసీ నాయకులు మురళి భాష నాగరాజు రాజేంద్ర ప్రసాద్ చిన్న గోవిందరెడ్డి యువజన సంఘం నాయకులు మొత్తం జేమ్స్ సతీష్ లోకయ్య పాల్గొన్న కార్మిక సంఘం నాయకులు

## మిషన్ మోడల్ మైండ్స్ కు వెలుగోడు విద్యార్థులు ఎంపిక

నేటి శుభోదయ -వెలుగోడు:నంద్యాల జిల్లా ప్రతినిధి (నాగేంద్ర ) ఏపీ మోడల్ స్కూల్ లో చదువుతున్న ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థుల కోసం, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మిషన్ మోడల్ మైండ్స్ పేరుతో మొట్ట మొదటి సారిగా ఐఐటి, నీట్ మరియు ఈ.ఏ.పి సెట్ ఎంట్రన్స్ పరీక్షల కోసం, 30 రోజుల పాటు హాస్టల్ వసతితో కూడిన రెసిడెన్షియల్ కోచింగ్ ఏర్పాటు చేయడమైనది. వీటికి వెలుగోడు ఆదర్శ పాఠశాల నుంచి ఎంపీసీలో నాలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు, వారి పేర్లు ఎస్. అల్తాఫ్ హుస్సేన్, పి. భవానీ శంకర్ ఎన్ శ్రీధర్, పి జహీర్ ఖాన్ ఎంపిక అవ్వడం చాలా సంతోషంగా ఉందని ఆ పాఠశాల ప్రిన్సిపల్ ఎన్ నళిని హర్షం వ్యక్తం చేశారు.ఎంపిక అయిన విద్యార్థులు ఏప్రిల్ 2వ తేదీన ఆయా సెంటర్లలో రిపోర్ట్ చేయాలని ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉత్తమ ర్యాంకులు సాధించాలని కోరారు

## పుట్టపర్తి లో టిడిపి కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి అనగాని సత్య ప్రసాద్




పుట్టపర్తి, నేటి శుభోదయ ::: పుట్టపర్తి టీడీపీ కార్యాలయాన్ని బుధవారం జిల్లా ఇన్ ఛార్జ్ రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, సవితమ్మ, టిడిపి జిల్లా అధ్యక్షుడు ఎంఎల్ఏ ఎంఎస్ రాజు,పల్లె సింధూర రెడ్డి,కందికుంట ,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ధర్మవరం టీడీపీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ లతో కలిసి ప్రారంభించారు. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని వై జంక్షన్ లో నూతన రోడ్డులో నూతన తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని రాష్ట్ర రెవిన్యూ శాఖ జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ , మంత్రి సవితమ్మ,ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యేలు కందికుంట వెంకటప్రసాద్,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి రాష్ట్ర డైరెక్టర్లులతో కలసి ప్రారంభించారు. ముందుగా మంత్రి అనగానీ సత్యప్రసాద్, ఎమ్మెస్ రాజు చేతులమీదుగా టీడీపిజెండాను ఎగురవేశారు.




అనంతరం పార్టీ కార్యాలయాన్ని మంత్రులు , ఎమ్మెల్యేలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ క్రమ శిక్షణకు మారుపేరని పేర్కొన్నారు. టిడిపి పార్టీని స్థాపించి 44 ఏళ్లు పూర్తి చేసుకొని పార్టీఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరుపుకున్నట్లు తెలిపారు .కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేశారని పేర్కొన్నారు. ఎక్కడ చూసినా ఆర్థిక విధ్వంసం, వనరుల దోపిడీ , అవినీతి దోపిడి జరిగిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెద్ద పీట వేశారనీ పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## అమరావతికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం మంత్రి అనిత**

**సిఎం చంద్రబాబు కృషి వల్లే ఇదంతా సాధ్యమైంది**

**- అమరావతి రైతుల తరఫున సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు**



విశాఖపట్నం, నేటి శుభోదయ ::: అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి హోంమంత్రి అనిత ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి వల్లే ఇదంతా సాధ్యమైందన్నారు. అమరావతి రైతుల తరఫున సీఎం చంద్రబాబుకు హోంమంత్రి కృతజ్ఞతలు తెలియజేశారు. అమరావతిపై పోరాడి విజయం సాధించిన రైతులకు అభినందనలు తెలిపారు. అమరావతికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఇది రైతుల త్యాగాలకు, శాంతియుత పోరాటానికి దక్కిన ఫలితమన్నారు. అమరావతిని అంగుళం కూడా వేరొకరు కదిపే పరిస్థితి లేకుండా కట్టుదిట్టంగా చట్టాలు, శాసనాలతో ఏర్పాటు చేసిన ఘనత కూటమి ప్రభుత్వం సొంత మన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవ రాజధానిగా అమరావతిని పునఃప్రతిష్ఠించిన కేంద్ర ప్రభుత్వానికి, మద్దతుగా నిలిచిన అన్ని పక్షాలకు హోంమంత్రి అనిత ధన్యవాదాలు తెలిపారు.

## రఘుదేవపురం గ్రామ దేవత శ్రీ శ్రీ శ్రీ చింతలమ్మా సిరి జాతర ఉత్సవాలలో బీజేపీ రాజానగరం నియోజకవర్గం మాజీ ఇంచార్జి 'నీరుకొండ' ప్రత్యేక పూజలు



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి ( ఏ.కె); తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురం గ్రామ దేవత శ్రీ శ్రీ శ్రీ చింతలమ్మా సిరి జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారం ఈ కార్యక్రమనికి రాజానగరం నియోజకవర్గం బిజిపి మాజీ కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి విచ్చేశారు.



అమ్మవారి దర్శనం చేసుకొన్నారు. ఆలయంలో వివిధ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీరన్న చౌదరికి కమీటీ నిర్వాహకులు, గ్రామస్తులు, ఎన్డీయే కూటమి నాయకులు ఘనం స్వాగతం పలికారు. అదేవిధంగా ఆలయంలో వివిధ ఆధ్యాత్మిక, సంస్కృతిక కార్యక్రమాలు వేడుకగా నిర్వహించారు. సీతానగరం, రాజమహేంద్రవరం, కోరుకొండ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

## ఏరాసు ప్రతాపరెడ్డి కి భవిష్యత్తులో కేంద్ర స్థాయి ఉన్నత పదవి నారా లోకేష్ హామీ



నేటి శుభోదయ వెలుగోడు :ఏప్రిల్ 1 న్యూస్ :నంద్యాల జిల్లా ప్రతినిధి టనాగేంద్ర ఊ:మాజీ మంత్రి ప్రతాపరెడ్డికి భవిష్యత్తులో కేంద్రస్థాయి ఉన్నత పదవి ఇవ్వడం జరుగుతుందని తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చినట్లు ఏరాసు ప్రతాప్ రెడ్డి తెలిపారు. బుధవారం ఉండవల్లి లోని నారా లోకేష్ నివాసంలో ఏరాసు ప్రతాప్ రెడ్డి, వి ఆర్ కే, ఆర్ ఆర్ సంస్థ అధినేత రాఘవ రెడ్డి దాదాపు రెండు గంటల పాటు భవిష్యత్తులో రాష్ట్రంలో పెరుగునున్నా శాసన సభ, లోక్ సభ స్థానాలపై సుదీర్ఘంగా చర్చించామన్నారు. కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి హార్టీకల్చర్ కి ఇస్తున్న చేయుత , సబ్సీడీ నీ రాయలసీమ ప్రాంత రైతులకు ఏ విధంగా అందించాలన్న విషయం పై చర్చించడం జరిగిందన్నారు. భవిష్యత్తులో ఏరాసు ప్రతాపరెడ్డి కి కేంద్ర స్థాయి ఉన్నత పదవి ఇవ్వడానికి అధినేత చంద్రబాబు నాయుడు ఆలోచిస్తున్నారని, నేను కూడా మీకు ఉన్నత పదవి వచ్చే విధంగా కృషి చేస్తానని నారా లోకేష్ హామీ ఇచ్చారన్నారు.నంద్యాల మరియు కర్నూలు జిల్లాలో పార్టీని బలోపేతం చేయడం కోసం తీసుకోవలసిన కార్యక్రమాలను గురించి ,మన మంచి ప్రభుత్వం తీసుకొచ్చిన సంక్షేమ అభివృద్ధి పథకాలను రాష్ట్రంలోని గడప గడపకు చేరేలా తీసుకోవాల్సిన అంశాలపై చర్చించడం జరిగిందన్నారు.

# సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్ద పీట

**- ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండ అమలు చేశాం**

**- సూపర్ సిక్స్ ను సూపర్ హిట్ చేశాం**

**చేనేత కార్మికులకు 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్**

**దేశంలో ఏ రాష్ట్రంలో లేనట్టుగా అత్యధిక పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్**



పుట్టపర్తి, నేటి శుభోదయ ::: పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుముల పల్లిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ తో పాటు చేనేత కార్మికుల కు 200 యూనిట్లు వరకు పవర్ లూమ్ కార్మికులకు 500 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్తు లబ్ధిదారులకు రాష్ట్ర రెవిన్యూ , జిల్లా ఇన్ఛార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఆర్ డి ఓ సువర్ణ చేతుల మీదుగా లబ్ధిదారులకు పెన్షన్ లతోపాటు చేనేత కార్మికులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి అనగానే సత్య ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సంక్షేమానికి పెద్ద పీట వేసిందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 93,000 మంది చేనేత కార్మిక కుటుంబాలకు 11 48 మంది పవర్లూమ్ యూనిట్లు అభ్యర్థి పొందుతున్న కార్మికులకు సుమారు 150 కోట్ల కేటాయించి నూతనల ఆర్థిక భరోసా కు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందన్నారు అందులో భాగంగా సత్య సాయి జిల్లాలో తొమ్మిది వేలకు పైగా ఉన్న ఇలాంటి కార్మికులకు ఉచిత విద్యుత్తు రాయితీ వర్తించే విధంగా చేనేత కార్మికులను ఆదుకుంటుందని తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గం లో 215 మంది చేనేత కార్మికులకు 07 మంది పవర్ లూమ్ ఉన్న వారికి వీటిని వర్తింపజేస్తున్నట్లు తెలిపారు.గత వైసిపి ప్రభుత్వం లో ఎక్కడ ఇలాంటి సంక్షేమ పథకాలు కానీ ఎలాంటి అభివృద్ధి కూడా రాష్ట్రంలో అమలు కాలేద న్నారు. వైసిపి హయాంలో అంతా విధ్వంసం ఆర్థిక దోపిడీ దౌర్జన్యం తప్పితే అభివృద్ధి శూన్యమన్నారు. అమరావతి రాజధాని పై జగన్ మనకస్థితి బాగలేక రోజుకు పూటకోగా మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. అందుకే గత ఎన్నికల్లో ప్రజలు 11 సీట్లకే పరిమితం చేశారని ఆ కసి ప్రజలపై చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు. జగన్ వ్యాఖ్యలు మానుకోవాలని సూచించారు. అనంతరం పుట్టపర్తి రైల్వే స్టేషన్ ఎదురుగా కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ రెవెన్యూ భవనాన్ని మంత్రి అనగానే సత్యప్రసాద్ సవితమ్మ సత్య కుమార్ యాదవ్ తో పాటు ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి ,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి,ఎమ్మెస్ రాజు కందికుంట వెంకటప్రసాద్ ,జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్,జేసి మంత్రి మౌర్య భరద్వాజ్, ఎస్పీ సతీష్ కుమార్ లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అహుడా చైర్మన్ టీ సి వరుణ్ , ఇరిగేషన్ డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్ , జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, పుట్టపర్తి యువ నాయకులు రామారావు ,లక్ష్మీపతి , గంగాధర్ నాయుడు, ఊరు వాకిలి సురేష్ ,సురేష్ చౌదరి ,కూటమి పార్టీల నాయకులు సాలక్క గారి శ్రీనివాసులు , వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఒలిపి శ్రీనివాసులు , డైరెక్టర్లు కాలే నాయక్, బంగారు కృష్ణమూర్తి, వల్లపు సోమశేఖర్ ,శ్రీనివాస్ నాయక్ , టీడీపీ కన్వీనర్లు బోయ రామాంజనేయులు, విజయ్ కుమార్, మల్లి రెడ్డి, గోపాల్ రెడ్డి మైలేజ్ శంకర్ ,ప్రజాప్రతినిధులు శ్రీరామ్ రెడ్డి , పుల్లప్ప ఇతర ప్రజా ప్రతినిధులు టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# చంద్రబాబు హీరో... జగన్ విలన్

**-రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత**

**-ఉచిత విద్యుత్ అమలుతో నేతన్నలకు ఆర్థిక మేలు**

**--ఏటా రూ.150 కోట్ల వ్యయం**

**-రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో పరుగులు పెట్టిస్తున్న సీఎం చంద్రబాబు**

**-రాష్ట్ర పతనాన్ని కోరుకుంటున్న జగన్**

**-భవిష్యత్తులో జగన్ వల్ల ఇబ్బందులు రాకూడదనే అమరావతికి చట్టబద్ధత : మంత్రి సవిత**

**-పెనుకొండలో చేనేతలకు ఉచిత విద్యుత్ ధ్రువపత్రాలు అందజేసిన మంత్రి సవిత**

పెనుకొండ,ఏప్రిల్1( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) రాష్ట్రంలో వరుసగా సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు ప్రజల మనస్సుల్లో హీరోగా నిలిచారని, రాష్ట్ర పతనాన్ని కోరుకుంటున్న జగన్ ను విలన్ గా చూస్తున్నారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. చోరీలకు కేరాఫ్ అడ్రాస్ జగన్ అని విమర్శించారు. ఆయన చోరీలను క్రెడిట్ చేసుకోవాల్సిన దుస్థితి ఎవరికీ లేదని ఎద్దేవా చేశారు. చేనేతలు గౌరవప్రదమైన జీవనం సాగించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందులో భాగంగానే ఎన్నికల హామీని నెరవేరుస్తూ నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకానికి సీఎం చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారన్నారు. ఇప్పటికే చేనేత రంగ అభివృద్ధికి అమలు చేస్తున్న పథకాలతో పాటు ఉచిత విద్యుత్ పథకానికి నాంది పలుకడంతో నేతన్నలకు మరింత ఆర్థిక పరిపుష్టి కలగనుందన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలో రైల్వే స్టేషన్ రోడ్డు కాలనీలో బుధవారం నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకానికి సంబంధించిన ధ్రువ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేరుస్తూ సూపర్ సిక్స్ పథకాలను విజయవంతం చేసిందన్నారు. మహిళలకు, దివ్యాంగులకు, రైతులకు, నేతన్నలకు ఇలా అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఇటీవలే దివ్యాంగులకు కూడా ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలే కల్పనే లక్ష్యంగా ఉగాది పండుగ నాడు జాబ్ క్యాలెండర్ విడుదల చేసిందన్నారు.

### చంద్రబాబు రాకతో చేనేత మహర్దశ

జగన్ ప్రభుత్వ తీరుతో పూర్తిగా నిర్వీర్యమైపోయిన చేనేత రంగానికి 2024లో సీఎం చంద్రబాబు ఏర్పాటుతో మహర్దశ ప్రారంభమైందన్నారు. నేతన్నలకు మేలు కలిగేలా పథకాలు అమలుచేస్తున్నారన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కింద 92,724 మంది నేతన్నలకు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెన్షన్ మొత్తం పెంచామన్నారు. చేనేతలకు త్రిఫ్ట్ కింద ప్రభుత్వ వాటాను 8 నుంచి 16 శాతానికి పెంచిందన్నారు. ఈ పథకం కింద ప్రతి బడ్జెట్ లోనూ రూ.5 కోట్లు చొప్పున్న కేటాయిస్తూ వస్తున్నామన్నారు. క్యాష్ క్రెడిట్ కార్డులతో సహకార సంఘాలకు బ్యాంకు రుణాలు అందజేస్తున్నామన్నారు. 15 శాతం రాయితీపై నూలు సబ్సిడీ పథకం అమలు చేస్తున్నారమన్నారు. 2,640 మంది చేనేత కార్మికులకు ముద్ర పథకం కింద రూ.24.43 కోట్లు అందజేశారన్నారు. చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచేలా చర్యలు తీసుకుంటూ, రాష్ట్ర వ్యాప్తంగా చేనేత ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నేతన్నల ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దీనిలో భాగంగా యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా నేతన్నల ఆరోగ్య రక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. చేనేత రంగ అభివృద్ధి కోసం ముడి సరుకులపై సబ్సిడీ, నెట్ ఫండ్ అందజేస్తూ, ఆధునిక డిజైన్లపై శిక్షణ అందిస్తున్నామన్నారు. పనిముట్ల కొనుగోలుకు 90 శాతం వరకు సబ్సిడీతో అందజేస్తున్నామన్నారు.

### -రూ.150 కోట్లతో ఉచిత విద్యుత్ అమలు

నేతన్నల కుటుంబాల్లో వెలుగులు నింపేలా కూటమి ప్రభుత్వం కీలకమైన ఉచిత విద్యుత్ పథకానికి శ్రీకారం చుట్టిందని మంత్రి సవిత తెలిపారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఏటా రూ.150 కోట్లు వెచ్చించనునందన్నారు. మగ్గంపై నేసే నేతన్నలకు 200 యూనిట్లు, పవర్ లూమ్ మగ్గాల నేతన్నలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేయబోతున్నాం. ఈ పథకం ద్వారా ఏడాదికి మగ్గం నేతన్నలకు రూ.8,640లు, మర మగ్గం నేతన్నలకు రూ.21,600లు ఆదా అవుతుందన్నారు. 1,04,000 మంది చేనేత కుటుంబాలు ఉచిత విద్యుత్ పథకం ద్వారా లబ్ధి పొందుతాయి. ఈ పథకంతో నేతన్నలకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుందనడంలో సందేహం లేదన్నారు. నేతన్నలు గౌరవప్రదమైన జీవనం సాగించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సవిత స్పష్టంచేశారు.

### చంద్రబాబు హీరో... జగన్ విలన్.



రాష్ట్రంలో సంక్షేమాన్ని, అభివృద్ధిని జోడు గుర్రాల్లా సీఎం చంద్రబాబునాయుడు పరుగులు పెట్టిస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు కలిగేలా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో అన్ని రోడ్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. పెనుకొండ పట్టణంలో రైల్వే స్టేషన్ రోడ్డు నిర్మించడంపై పట్టణ ప్రజలు ఆనందం వ్యకం చేస్తున్నారన్నారు. చోరీలకు కేరాఫ్ అడ్రాస్ జగన్ అని విమర్శించారు. ఆయన చోరీలను క్రెడిట్ చేసుకోవాల్సిన దుస్థితి ఎవరికీ లేదన్నారు. జగన్ విధ్వంస పాలన వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందన్నారు. అమరావతి రాజధానికి జగన్ వల్ల భవిష్యత్తులో ఎటువంటి నష్టం రాకూడదనే చట్టబద్ధత కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపామన్నారు. రాష్ట్రంలో వరుసగా సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు ప్రజల మనస్సుల్లో హీరోగా నిలిచారని, రాష్ట్ర పతనాన్ని కోరుకుంటున్న జగన్ ను విలన్ గా చూస్తున్నారని అన్నారు. అంతకుముందు పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు కాలనీలో చేనేత కార్మికులకు మంత్రి సవిత ఉచిత విద్యుత్ ధ్రువపత్రాలను అందజేశారు. చేనేత రంగానికి సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, చేనేత కుటుంబాలు పాల్గొన్నారు.

### ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్ల పండగ

పట్టణంలో రైల్వేస్టేషన్ రోడ్డు కాలనీలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను మంత్రి సవిత ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రతి నెలా ఫస్ట్ తారీఖున రాష్ట్ర వ్యాప్తంగా పెన్షన్ల పండుగ జరుగుతోందన్నారు. ఏప్రిల్ నెలకు సంబంధించి, రాష్ట్ర వ్యాప్తంగా 62.60 లక్షల మందికి పింఛనుదారులకు రూ.2,724 కోట్లను పంపిణీ చేస్తున్నామన్నారు. దేశంలో మరే రాష్ట్రంలోనూ ఇవ్వని విధంగా వృద్ధాప్యం, వింతతు, ఒంటరి మహిళలకు రూ.4 వేలు చొప్పున, దివ్యాంగులకు రూ.6 వేలు చొప్పున పెన్షన్లు అందజేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు.



## అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు**

**-దంటగుంట్ల గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ**

**-బాపులపాడు మండలంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం**



గన్నవరం, ఏప్రిల్ 1 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) నియోజకవర్గ శాసనసభ్యులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు బుధవారం బాపులపాడు మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా దంటగుంట్ల మరియు కాకులపాడు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో పాటు, లబ్ధిదారులకు స్వయంగా పెన్షన్లను పంపిణీ చేశారు. దేశంలో మరెక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం 'ఎన్టీఆర్ భరోసా' పథకం ద్వారా లబ్ధిదారులకు అత్యధిక పెన్షన్ అందిస్తూ అండగా నిలుస్తోందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. దంటగుంట్ల గ్రామంలో నిర్వహించిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా, ఎమ్మెల్యే స్వయంగా అధికారులు స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, వికలాంగులు ఇతర లబ్ధిదారులను పలకరిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకొని వారికి పెన్షన్ సొమ్ము అందచేశారు. పెన్షన్ల పంపిణీ అనంతరం అదే గ్రామంలో ఉపాధి హామీ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన సాధారణ వ్యక్తిగా మారిపోయి, కూలీలతో కలిసి స్వయంగా పలుగు, పారా పట్టుకుని వారితో కలిసి కొంతసేపు పనిచేశారు. కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు, ఉపాధి పనుల నాణ్యతను కూడా క్షుణ్ణంగా పరిశీలించారు.



గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా యార్లగడ్డ పలు నిర్మాణ పనులకు ప్రారంభోత్సవం చేశారు. దంటగుంట్ల గ్రామంలో రూ. 5.00 లక్షలతో ఏర్పాటు చేసిన బోర్‌వెల్, అలాగే ఎంపీ లాడ్స్ నిధులు రూ. 7.00 లక్షలతో నిర్మించిన మోటార్ మరియు హెచ్‌డీపీఎఫ్ పైప్‌లైన్ పనులను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. గ్రామంలో రూ. 2.14 లక్షలతో నిర్మించిన డొంక రోడ్డును ప్రారంభించారు. బాపులపాడు మండలం కాకులపాడు గ్రామంలో సుమారు రూ. 50.00 లక్షల భారీ వ్యయంతో నిర్మించిన బీటీ రోడ్డును ఆయన ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు , అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 'రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పెన్షన్ల పంపిణీని ఒక పండుగలా నిర్వహిస్తుండడం గర్వకారణం

**- రాజానగరం నియోజకవర్గంలో 'పేదలకు సేవలో' కార్యక్రమంలో పెన్షన్ల పంపిణీ చేసిన ఎమ్మెల్యే 'బత్తుల'**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె.)తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గంలో ఉదయం నుంచే పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ రాజానగరం మండలం పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో స్వయంగా లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.. 'ఏ కష్టం వచ్చినా ఎల్లవేళలా మీకు మేమున్నాం..' అంటూ లబ్ధిదారులకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలరామకృష్ణ మాట్లాడుతూ .. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పెన్షన్ల పంపిణీని ఒక పండుగలా నిర్వహిస్తోందన్నారు. ప్రజా సంక్షేమం పట్ల పూర్తి అంకితభావం, నిబద్ధతతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందనారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు సచివాలయ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీలంకమ్మ అమ్మ వారి జాతర మహోత్సవాలు



అవనిగడ్డ, ఏప్రిల్ 1 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) అవనిగడ్డలో అంగరంగ వైభవంగా ప్రారంభమైన దివిసీమ ఆరాధ్య దైవం శ్రీ లంకమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీ లంకమ్మ అమ్మవారు ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుంటున్న భక్తులు. ఆలయ చైర్మన్ అన్నపరెడ్డి వెంకటస్వామి ఆధ్వర్యంలో దర్శనానికి వచ్చే భక్తుల కోసం దేవాలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్ల చేసిన ఆలయ కార్య నిర్వహణ అధికారి జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవనిగడ్డ సబ్ డివిజన్ పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్న నిర్వహిస్తున్నారు.

# ప్రతినెలా ఒకటినే పెన్షన్లు

**అందచేసిన ఘనత చంద్రబాబుదే**

**-రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామప్రసాద్ గౌడ్**



పెనమలూరు, ఏప్రిల్ 1( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) ప్రతి నెల ఒకటవ తారీఖునే ఇంటి వద్దకు వచ్చి పెన్షన్లు అందజేస్తున్నందుకు వృద్ధులు, వితంతువులు వారి ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామప్రసాద్ గౌడ్ అన్నారు. శాసన సభ్యులు బోడె ప్రసాద్ ఆదేశాల మేరకు యనమలకుదురు గ్రామంలో ఎన్. టి. ఆర్. భరోసా పెన్షన్ లు పంపిణి చేసిన అనంతరం మాట్లాడారు.ప్రతి నెల ఒకటో తారీకునే ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు 4000 పెన్షన్లు అందజేస్తున్నందుకు స్థానిక ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని,వారి ఆనందానికి అడ్డు అదుపు లేదన్నారు. స్థానికంగా ఉన్న రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ సమస్యలపై స్థానిక శాసన సభ్యుల దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తున్నామని, స్థానిక ప్రజలు కూటమి ప్రభుత్వంపై, కూటమి నాయకులపై నమ్మకం ఉంచారు అన్నారు.చాలా చోట్ల కొత్త పెన్షన్ల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని, వీటిపై కూడా స్థానిక ప్రజలకు వివరిస్తరిస్తున్నామని,త్వరలోనే కొత్త పెన్షన్లు కు దరఖాస్తు చేసుకునే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇస్తున్నామన్నారు.

## గ్యాస్ ఏజెన్సీ తనిఖీ చేసిన తహసిల్దార్ జయసింహ



పులిచెర్ల, ఏప్రిల్ 1 ,(నేటి శుభోదయ) :చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరులో బుధవారం గ్యాస్ ఏజెన్సీ ని తహసిల్దార్ జయసింహ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏజెన్సీలో సిలిండర్ల నిల్వ, పంపిణీ రికార్డులను పరిశీలించారు. నిబంధనల మేరకు పంపిణీ చేయాలని సూచించారు. గ్యాస్ ఏజెన్సీ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.

## చక చకా సాగుతున్న ఆలయ అభివృద్ధి పనులు



పులిచెర్ల, ఏప్రిల్ 1 ,(నేటి శుభోదయ) :గ్రామస్తుల మహా సంకల్పం భగవంతుని ఆశీస్సులతో ఆలయ అభివృద్ధి పనులు చక చకా సాగుతున్నాయి. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం, ఎల్లంకివారిపల్లి లో బోధమృత గిరి ఆలయ అభివృద్ధికి గ్రామస్తులు నడుం బిగించారు. ఈ ఆలయం కొండపైన ఉండడం సరి అయిన దారి లేకపోవడంతో తొలుత రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని గ్రామస్తులు నిర్ణయించారు నిర్ణయం మేరకు జెసిబి లు, హిటాచి లతో పనులను శరవేగంగా చేర్చారు దీంతో ఆలయానికి రోడ్డు మార్గం పూర్తయింది ఈ నేపథ్యంలో బుధవారం ఆలయం వద్ద గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి అందరూ చేయి చేయి కలపడం. విశేషం.

## ఇంద్రకీలాద్రిపై వైభవంగా శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల చైత్రమాస బ్రహ్మోత్సవాలు

**- బుధవారం 'సదస్యం' శుక్రవారం కృష్ణా నదిలో 'నదీ విహారం'**



విజయవాడ, ఏప్రిల్ 1 (నేటి శుభోదయ):- చైత్రమాస కళ్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ కనకదుర్గమ్మ, శ్రీ మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం 10:00 గంటలకు వేద పండితుల ఆధ్వర్యంలో 'సదస్యం' నిర్వహించారు. వేద స్వస్తి పఠనంతో భక్తులకు పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. స్వామి వారు అమ్మవారితో కలిసి నంది వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. నేటి ఉదయం 9:00 గంటలకు పూర్ణాహుతి, వసంతోత్సవము, పవిత్ర కృష్ణా నదిలో అవభృథ స్నానము, ధ్వజావరోహణ కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు శాస్త్రోక్తంగా ముగుస్తాయి. శుక్రవారం బ్రహ్మోత్సవాల అనంతరం సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. సాయంత్రం 4:30 గంటల నుండి సాంస్కృతిక కార్యక్రమాలు, అనంతరం ఆలయం నుండి నది వరకు స్వామి వార్ల ఊరేగింపు ప్రారంభమవుతుంది. సాయంత్రం 5:00 గంటలకు శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ మల్లేశ్వర స్వామి వార్ల "నదీ విహారము" (నౌకా విహారం) పవిత్ర కృష్ణా నదిలో కనుల పండువగా జరుగుతుందని ఆలయ ఈవో వి.కె. శీనానాయక్ తెలిపారు. రాత్రి 7:30 గంటలకు ద్వాదశ ప్రదక్షిణలు, రాత్రి 8:30 గంటలకు పుష్ప యాగశయనోత్సవము (పవళింపు సేవ) తో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి. భక్తులు ఈ విశేష కార్యక్రమాల్లో పాల్గొని స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని దేవస్థాన అధికారులు కోరారు.

## 'విధుల్లో నిర్లక్ష్యం పై దేవస్థాన ఉద్యోగి విధులు నుండి తొలగింపు'

విజయవాడ, ఏప్రిల్ 1 (నేటి శుభోదయ):- కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ, బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించిన దేవస్థాన గోల్డ్ అప్రైజర్ డి. షమ్మీ అనే ఉద్యోగిని విధులు నుండి తాత్కాలికంగా తొలగించినట్లు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వి.కె. శీనానాయక్ తెలిపారు. సోమవారం జరిగిన హుండీ కానుకల లెక్కింపులో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించి, బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించినందుకు ఉద్యోగిని వివరణ కోరగా, అతని సంజాయిషీ పరిశీలించి, కానుకల లెక్కింపులో లోపాలు సరిగ్గా పరిశీలన చేయకుండా, దేవస్థానం ప్రతిష్టకు భంగం కలిగేలా ప్రచారం జరుగడానికి ఆస్కారం కల్పించేలా వ్యవహరించినందుకు విధులు నుండి తాత్కాలికంగా తొలగిస్తున్నట్లు ఆలయ ఈఓ తెలిపారు.

## సింహవాహనంపై శ్రీ గంగా, పార్వతీ(దుర్గా)సమేత మల్లేశ్వరులు



విజయవాడ, ఏప్రిల్ 1 (నేటి శుభోదయ):- ఇంద్రకీలాద్రి పై శ్రీగంగా, పార్వతీ(దుర్గా)సమేత మల్లేశ్వరుల చైత్రమాస కళ్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా నాల్గవ రోజైన బుధవారం ఉదయం 8 గంటల నుండి పండితులు మూల మంత్రహవనములు నిర్వహించారు. అనంతరం ఉదయం 10 నుండి సదస్యము కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వేద స్వస్తి, వేద పండితులు వేద ఆశీస్సులు అందజేశారు. సాయంత్రం 5 గంటల నుండి 6 గంటల వరకు ఔపాసన, బలిహరణ,హారతి, మంత్రపుష్పం, ప్రసాద వితరణ కార్యక్రమాలు భక్తి పూర్వకంగా జరిగాయి. చైత్ర మాస కల్యాణ బ్రహ్మోత్సవ వాహన సేవల్లో భాగంగా.సాయంత్రం 5 గంటల నుండి - మల్లేశ్వర మహామండపం నుండి శ్రీ గంగా, పార్వతీ(దుర్గా) సమేత మల్లేశ్వరుల సింహవాహనసేవ ప్రారంభం అయింది.ఆది దంపతులు అధిరోహించిన సింహవాహన దర్శనంతో మానవులలో అచైతన్యంగా ఉన్న శక్తులన్నీ చైతన్యవంతమవుతాయని,సోమరితనం నశించి పట్టుదలతో ముందుకు సాగి సర్వత్రా విజయం సాధించి ఆధిపత్యంతో రాణించే స్ఫూర్తి సిద్ధిస్తుందని పురాణోక్తి. అజ్ఞానంతో ప్రవర్తించే దుష్టులను హరించడంలో నేను, నా వాహనమైన సింహమూ సమాన ప్రయత్నంతో ఉంటామని ఈ వాహనోత్సవం ద్వారా అమ్మవారు రూపిస్తున్నారు. ఇలా ప్రఖ్యాతిగాంచిన సింహ వాహనంపై అమ్మవార్లు, స్వామి కొలువై ఉండగా..సంప్రదాయ కళలైన తప్పెట్లు, మహిళా కోలాట నృత్యములు, చిన్నారుల కోలాట ప్రదర్శన,తాళం భజన కళాకారుల ప్రదర్శలు ముందు సాగుతుండగా, వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ సింహ వాహనసేవ శ్రేణి శ్రీ కనకదుర్గానగర్, రథం సెంటర్, మార్కెట్, గాంధీ నగర్, గవర్నర్ పేట,పాత బస్ స్థాండ్, ఫ్లైఓవర్ మీదుగా తిరిగి దేవస్థానం చేరుకుంది.సింహవాహనసేవ సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు విశేషసంఖ్యలో ఊరేగింపు లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ఈవో వికె శీనా నాయక్,స్థానాచార్య శివ ప్రసాద్ శర్మ, ముఖ్య అర్చకులు ఆర్. శ్రీనివాస శాస్త్రి తదితరులు కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించారు.

# జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**-జిల్లా సమీక్షా మండలి సమావేశంలో జిల్లా ఇన్చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్**



మచిలీపట్నం: ఏప్రిల్ 1( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజలకు సమర్థవంతంగా చేరేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర కార్మిక, కర్మాగారాలు, బాయిలర్లు, వైద్య బీమా సేవల శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశించారు.బుధవారం మధ్యాహ్నం స్థానిక జిల్లా పరిషత్ సమావేశపు మందిరంలో జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్ తో కలిసి జిల్లా సమీక్షా మండలి సమావేశం నిర్వహించి అధికారులతో సమీక్షించారు. సమావేశంలో ప్రధానంగా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, జిల్లా నీటియాజమ్య సంస్థ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, వ్యవసాయం, రహదారులు భవనాలు తదితర శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనులు, సమస్యలు చర్చించారు.సమావేశంలో గుడివాడ, పామర్రు నియోజకవర్గాల శాసన సభ్యులు వెనిగండ్ల రాము, వర్ల కుమార్ రాజా, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి వారి నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలను ప్రస్తావించి పరిష్కరించాలని మంత్రులు, అధికారులను కోరారు.సమావేశంలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి సంబంధించి మౌలిక సదుపాయాలు, ప్రజా సేవలు, సామాజిక సంక్షేమ కార్యక్రమాలు, శాఖల వారీ పురోగతి అంశాలపై మంత్రి సమీక్షించారు. ప్రతి శాఖ తమ లక్ష్యాలను సమయానికి పూర్తి చేయడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందని, అందుకు అనుగుణంగా జిల్లా స్థాయిలో అధికారులు జవాబుదారీతనంతో, చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని మంత్రి పేర్కొన్నారు.మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం జనాభా 58 శాతం ఉన్నప్పటికీ ఆంధ్రప్రదేశ్కు కేవలం 46 శాతం వనరులు మాత్రమే దక్కాయని, దీనివల్ల రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. తెలంగాణకు ఎక్కువ లబ్ధి చేకూరగా, ఆంధ్రప్రదేశ్ అనేక రంగాల్లో వెనుకబడిందన్నారు. రాష్ట్రానికి సుమారు రూ.3.28 లక్షల కోట్ల బడ్జెట్ ఉన్నప్పటికీ, అందులో ప్రభుత్వానికి వచ్చే ఆదాయం, పన్నులు, ఇతర వనరులు ప్రధానంగా జీతాలు, వడ్డీల చెల్లింపులకే సరిపోతున్నాయని తెలిపారు. ఇదే సమయంలో సంక్షేమ పథకాలు కూడా కొనసాగించాల్సిన అవసరం ఉందని, ఈ నేపథ్యంలో ప్రభుత్వం, అధికారులు మరింత బాధ్యతతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.ప్రభుత్వం ఇది ఇవ్వాలి, అది ఇవ్వాలి అని ప్రజలు భావిస్తారని, అయితే అందుకు అవసరమైన వనరులు ఎక్కడి నుంచి వస్తాయో కూడా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అప్పులు చేయడం లేదా ఆస్తులు అమ్మడం వంటి పరిస్థితులు రాకుండా ఉండాలంటే రాష్ట్ర వనరులను పెంచడం, పెట్టుబడులను ఆకర్షించడం, ఉపాధి అవకాశాలను సృష్టించడం అత్యవసరమన్నారు.దక్షిణ భారతదేశంతో పోలిస్తే రాష్ట్ర తలసరి ఆదాయం చాలా తక్కువగా ఉందని, తెలంగాణలో అది సుమారు రూ.3.84 లక్షలు ఉండగా, మన రాష్ట్రం ఇంకా ఆ స్థాయికి చేరాల్సి ఉందన్నారు. జిల్లాలో కూడా అభివృద్ధి అవకాశాలు విస్తారంగా ఉన్నాయని, వాటిని సమర్థంగా వినియోగించుకుంటే తలసరి ఆదాయాన్ని మరింత పెంచవచ్చన్నారు.జిల్లాలో ఆక్వాకల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, పోర్టు ఆధారిత పరిశ్రమలు, హార్టికల్చర్, పామాయిల్ తోటలు వంటి రంగాల్లో పెట్టుబడులకు మంచి అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. పోర్టు ఏర్పాటుతో పరిశ్రమల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని, దీనివల్ల ఉపాధి, ఆదాయం, స్థూల ఆర్థికాభివృద్ధి పెరుగుతాయని తెలిపారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీచర్లు, పోలీసులు, గ్రూప్-2 పరీక్షల ద్వారా దాదాపు 30 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించామని, ప్రైవేట్ రంగంలో కూడా సుమారు 6 లక్షల ఉద్యోగాలు కల్పించగలిగామని, మొత్తం 20 లక్షల మందికి ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం అని వెల్లడించారు. సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ వంటి కార్యక్రమాలకు సంవత్సరానికి సుమారు రూ.35 వేల కోట్లు, తల్లికి వందనం పథకం ద్వారా పిల్లలకు రూ.15 వేలు చొప్పున అందించేందుకు సుమారు రూ.10 వేల కోట్లు ఖర్చవుతున్నాయని తెలిపారు. అదేవిధంగా 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం, చేనేత కార్మికులకు 200, 500 యూనిట్ల ఉచిత విద్యుత్, మత్స్యకార భరోసా వంటి పథకాలను ప్రభుత్వం సమర్థంగా అమలు చేస్తోందన్నారు. ఈ పథకాలన్నీ ప్రజలకు పక్కాగా, పారదర్శకంగా, అర్హులందరికీ చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు.జిల్లా సమీక్షా మండలి సమావేశాల్లో కొన్ని శాఖల పనితీరు ఆశించిన స్థాయిలో కనిపించడం లేదని, కొంత నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు మరింత చురుకుదనం ప్రదర్శించి, క్షేత్రస్థాయిలో సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు.వేసవి దృష్ట్యా తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎక్కడా నీటి సరఫరాకు ఆటంకం కలగకుండా ఆర్డబ్ల్యూఎస్, ఇతర సంబంధిత విభాగాలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అవసరమైతే మోటార్లు, జనరేటర్లు వినియోగించి ట్యాంకులు నింపే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అదేవిధంగా ఇరిగేషన్ శాఖ డ్రైనేజీలలో పూడిక తీత, నిర్వహణ పనులు, రహదారులు భవనాలు శాఖ రోడ్ల పనులు, పంచాయతీ రాజ్ శాఖ గ్రామీణ మౌలిక వసతుల పనులు ఈ రెండు నెలల్లో పూర్తి చేయాలని సూచించారు. మే, జూన్ నెలల తర్వాత వర్షాకాలం ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున, ఈ వేసవిలోనే పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఏప్రిల్ 15 నుండి వేట నిషేధ కాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో మే నెలలో మత్స్యకార భరోసా పథకం అమలవుతుందని తెలిపారు. అలాగే పోర్టు పనులను ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆర్ టి జి ఎస్ వ్యవస్థ ద్వారా 50కి పైగా శాఖల పనితీరు, ప్రజల సంతృప్తి స్థాయిని పర్యవేక్షిస్తున్నారని, ప్రజల అభిప్రాయాల ఆధారంగా అధికారుల పనితీరును అంచనా వేస్తున్నారని మంత్రి తెలిపారు. కాబట్టి అధికారులు ప్రజా సేవలను మరింత మెరుగుపరచి, జిల్లాను అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ 202627 అవుట్ రీచ్ ప్రోగ్రాంను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా జిల్లాకు సూపర్ సిక్స్ పథకాల కింద, అలాగే శాఖల వారీగా కేటాయించిన బడ్జెట్ను సమర్థవంతంగా వినియోగించేందుకు అధికారులు ముందస్తు ప్రణాళికతో పని చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. జిల్లాకు వచ్చిన ప్రతి రూపాయి అర్హులైన లబ్ధిదారులకు చేరేలా, అలాగే ప్రతి శాఖకు కేటాయించిన నిధులు లక్ష్యానికి అనుగుణంగా వినియోగించేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.కృష్ణా జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద 2,28,168 మంది లబ్ధిదారులు ఉన్నారని, గత ఏడాది రూ.1,191 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.1,225 కోట్లు కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు.అదేవిధంగా తల్లికి వందనం పథకం కింద జిల్లాలో 1,91,000 మంది లబ్ధిదారులు ఉన్నారని, గత ఏడాది రూ.242 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.295 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. అన్నదాత సుఖీభవ పథకానికి గత ఏడాది రూ.182 కోట్లు, ఈ ఏడాది రూ.186 కోట్లు, దీపం పథకంకు గత ఏడాది రూ.86 కోట్లు, ఈ ఏడాది రూ.94 కోట్లు, స్త్రీ శక్తి పథకానికి గత ఏడాది రూ.40.98 కోట్లు, ఈ ఏడాది రూ.56 కోట్లు కేటాయించారని తెలిపారు.అలాగే మత్స్యకార భరోసా పథకానికి గత ఏడాది రూ.25 కోట్లు, ఈ ఏడాది రూ.26 కోట్లు, ఆటో డ్రైవర్ల సంక్షేమానికి గత ఏడాది రూ.16 కోట్లు, ఈ ఏడాది రూ.17 కోట్లు కేటాయించబడినట్లు వివరించారు.శాఖల వారీగా చూస్తే, కృష్ణా జిల్లాలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు అత్యధికంగా రూ.526 కోట్లు కేటాయించగా, ఆ తర్వాత ఆరోగ్య శాఖకు రూ.344 కోట్లు, మహిళా శిశు అభివృద్ధి శాఖకు రూ.161 కోట్లు, విద్యాశాఖకు రూ.119 కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.74 కోట్లు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్కు రూ.53 కోట్లు, వ్యవసాయ శాఖకు రూ.36 కోట్లు, హార్టికల్చర్ శాఖకు రూ.16 కోట్లు కేటాయించినట్లు కలెక్టర్ వివరించారు.జిల్లా స్థాయిలో బడ్జెట్ కేటాయింపులు సమగ్రంగా ఉన్నప్పటికీ, ప్రతి నియోజకవర్గం, ప్రతి శాఖ వారీగా కూడా వాటిని లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రతి శాఖ తమ పరిధిలో ఉన్న ప్రతి పథకానికి ఎంత బడ్జెట్ కేటాయించబడిందో తెలుసుకుని, ఆ మేరకు అమలుపై దృష్టి పెట్టాలని సూచించారు.కొన్ని శాఖల్లో సాధారణంగా మార్చి నెలలో బడ్జెట్ విడుదలైన తర్వాతే ఖర్చు చేయాలనే ధోరణి కనిపిస్తోందని, ఇది సమర్థవంతమైన విధానం కాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేసుకుంటే, నిధుల వినియోగం సక్రమంగా, సమయానికి, ఫలితాల ఆధారంగా అమలు చేయవచ్చన్నారు. ప్రతి శాఖ బడ్జెట్ వినియోగంలో పారదర్శకత, వేగం, లక్ష్య సాధనపై దృష్టి పెట్టాలని, జిల్లాకు కేటాయించిన ప్రతి రూపాయి ప్రజలకు ప్రయోజనం చేకూరేలా వినియోగించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు.సమావేశంలో ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, సిపిఓ ఎస్ ఉమాదేవి, డ్వామా, ఐసిడిఎస్ పీడీలు ఎన్ శివ ప్రసాద్ యాదవ్, ఎంఎన్ రాణి, మత్స్య శాఖ అధికారి అయ్య నాగరాజ, పశుసంవర్ధక శాఖ అధికారి చిన్న నర్సింహులు, పంచాయతీరాజ్ ఎస్ఈ రమణ రావు, గృహ నిర్మాణ సంస్థ పిడి వెంకట్రావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఈ సోమశేఖర్, రహదారులు భవనాలు శాఖ ఈఈ లోకేశ్వరరావు, వ్యవసాయ శాఖ అధికారిణి ఎన్ పద్మావతి, డీఎస్ఓ మోహన్ రావు, డిఈఓ యు వి సుబ్బారావు, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ యుగంధర్, బీసీ కార్పొరేషన్ ఈడీ రాజేంద్ర బాబు, సోషల్ వెల్ఫేర్ డిడి షేక్ షాహిద్ బాబు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## అన్న క్యాంటీన్లలో ఆరోగ్యకరమైన వాతావరణం అందిస్తున్నాం

**: విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర**



విజయవాడ, ఏప్రిల్ 1 (నేటి శుభోదయ):- ఆర్టీసీ వర్క్షాప్ రోడ్డులో ఉన్న అన్న క్యాంటీన్ను విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడ అందిస్తున్న భోజన నాణ్యత, పరిశుభ్రత, సేవల విధానాన్ని పరిశీలించి, ఎటువంటి లోపాలు లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. అన్న క్యాంటీన్లలో రోజువారీ పర్యవేక్షణను కట్టుదిట్టంగా నిర్వహిస్తూ, ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు తప్పకుండా పాటించాలని నోడల్ అధికారులకు ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అన్నారు. అన్న క్యాంటీన్లో ఆహారం తీసుకోవడానికి వచ్చే ప్రజలతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అన్న క్యాంటీన్లో వసతులు ఎలా ఉన్నాయి? ఆహార నాణ్యత ఎలా ఉంది? సమయాపాలన జరుగుతుందా లేదా? వంటి అంశాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తమ సంతృప్తిని వ్యక్తపరిచి ఎటువంటి ఇబ్బందులు లేవని కమిషనర్ కు తెలిపారు.

## స్వర్గపురి అభివృద్ధికి ప్రాధాన్యం అన్ని వసతులు సమగ్రంగా కల్పించాలి: విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, ఏప్రిల్ 1 (నేటి శుభోదయ):- నగరంలోని స్వర్గపురులను సమగ్రంగా అభివృద్ధి చేసి, ప్రజలకు గౌరవప్రదమైన మరియు సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యమని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా కుమ్మరిపాలెం సెంటర్, విద్యార్థరపురం, పున్నమి హోటల్ సమీపంలో ఉన్న హిందూ, ముస్లిం, క్రైస్తవుల స్మశానవాటికలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలోని అన్ని స్వర్గపురులు పరిశుభ్రంగా, సక్రమంగా నిర్వహిస్తూ ఎటువంటి లోపాలు లేకుండా ఉండాలని స్పష్టం చేశారు. ఎక్కడైనా సమస్యలు ఉన్నట్లయితే వెంటనే గుర్తించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రత్యేకంగా, ప్రజలకు అవసరమైన మరుగుదొడ్లు, స్నాన గదులు, తాగునీటి సదుపాయం, విద్యుత్ వెలుగులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతేకాకుండా, స్మశానవాటికలలో పచ్చదనం పెంపొందించడానికి, చెట్లు నాటడం, నిర్వహణపై కూడా దృష్టి పెట్టాలని తెలిపారు.స్వర్గపురుల నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రజలకు ఇబ్బంది కలిగించే అంశాలపై తక్షణమే స్పందించి పరిష్కారం చూపాలని కమిషనర్ పేర్కొన్నారు. ప్రతి విభాగం సమన్వయంతో పనిచేస్తూ, సేవల నాణ్యతను మెరుగుపరచాలని సూచించారు.

## పింఛన్ లబ్ధిదారులకు సకాలంలో పింఛన్ పంపిణీ

**విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర**



విజయవాడ, ఏప్రిల్ 1 (నేటి శుభోదయ):- విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఉదయం చెరువు సెంటర్, విద్యాధరపురం, పరిసర ప్రాంతాలని పర్యటించి ఎన్టీఆర్ భరోసా పింఛను లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.ఆ ప్రాంతాల్లో గల పింఛను లబ్దిదారుల ఆధార్ కార్డు పరిశీలించి, ఫేస్ రికగ్నిషన్ సిస్టం (ఎఫ్ ఆర్ ఎస్ ) ద్వారా చెక్ చేసి పింఛన్ డబ్బులు అందించారు. వారితో మాట్లాడి వాళ్లకు ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు, ప్రతినెల పింఛను వస్తుందా లేదా, ఇంటికి వచ్చి ఇస్తున్నారా లేదా, ఎంత డబ్బులు ఇస్తున్నారు లాంటి ప్రశ్నలు వాళ్ళని అడిగి, ప్రతినెలా ఇస్తున్న పింఛను తీరును పరిశీలించారు. ఆ ప్రాంతంలో గల ప్రజలతో స్వయంగా మాట్లాడి ప్రతినెల పెన్షన్ వస్తుందా లేదా? ఎంత పెన్షన్ వస్తుంది? ఇతర సమస్యలు ఏమైనా ఉన్నాయా అని మాట్లాడితెలుసుకున్నారు. ప్రతి నెల సమయానికి పెన్షన్ సిబ్బంది అందిస్తున్నారని ఎటువంటి సమస్యలు లేదని వారు తెలుపగా సంతృప్తి చెందారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అక్కడున్న పింఛన్ లబ్ధిదారులకు స్వయంగా తానే ఎఫ్ ఆర్ ఎస్ తీసి పింఛన్ డబ్బులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మధ్యాహ్నం మూడు గంటల వరుకు, సర్కిల్ వన్ పరిధిలో 19,923 పెన్షన్ లకు గాను 18,548, సర్కిల్ 2 పరిధిలో 25,370 పెన్షన్ లకు గాను 23,533, సర్కిల్ 3 పరిధిలో 20,016 పెన్షన్ లకు గాను 18,472, మూడు సర్కిల్స్ పరిధిలో మొత్తం 65,309 పెన్షన్ లకు 60,553 పెన్షన్ల పంపిణీ చేశారని, అంటే దాదాపు 92% పెన్షన్ పంపిణీ చేశారని తెలిపారు.ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, పి.ఓ (యూ సి డి) యం. విజయ లక్ష్మి, సిడిఓ శ్రీకాంత్ ,తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేసిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు



విజయవాడ, ఏప్రిల్ 1 (నేటి శుభోదయ):- ఎన్టీఆర్ భరోసా పథకం కింద మైలవరం నియోజకవర్గంలో 40,065 మందికి రూ.17.30 కోట్ల పింఛన్ సొమ్మును ఈ నెల పంపిణీ చేస్తున్నట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని మూలపాడులో ఎన్టీఆర్ భరోసా పథకం కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్లను మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు, కూటమి నేతలు బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. రెడ్డిగూడెం మండలంలో 7,074 మందికి రూ.3.04కోట్లు, మైలవరం మండలంలోని 9,408 మందికి రూ.4.06కోట్లు, విజయవాడ రూరల్ మండలంలోని 5,416 మందికి రూ.2.32 కోట్లు, జి.కొండూరు మండలంలోని 8,406 మందికి రూ.3.60 కోట్లు, ఇబ్రహీంపట్నం మండలంలోని 4,682మందికి రూ.2.01 కోట్లు, కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 5,180 మందికి రూ.2.27 కోట్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెంచిన సామాజిక భద్రత పింఛన్లు లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారుల తరపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కి కృతజ్ఞతలు తెలిపారు. మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), స్థానిక ఎన్డీఏ కూటమి నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు చేరువుగా కూటమి ప్రభుత్వం

**జీవనోపాధి నిమిత్తం రూ.25వేలు విలువైన తోపుడుబండిని మహిళకు ఉచితంగా అందచేసిన ఎమ్మెల్యే గద్దె**



విజయవాడ, ఏప్రిల్ 1 (నేటి శుభోదయ):- ప్రజలకు దగ్గరగా ఉంటూ వారి అవసరాలను తీర్చే విధంగా తమ కూటమి ప్రభుత్వం ఉందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. యుద్ధం కారణంగా ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా కూటమి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని అన్నారు. పటమట అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయం దగ్గర నిరుపేద కుటుంబానికి చెందిన పార్టీ కార్యకర్తకు స్వయం ఉపాధి నిమిత్తం రూ. 25 వేల విలువ చేసే తోపుడు బండిని ఎమ్మెల్యే గద్దె తన సొంత నిధులతో కొనుగోలు చేసి వారికి ఉచితంగా బుధవారం అందచేశారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ అమెరికా, ఇరాన్ దేశాల మధ్య యుద్ధం కారణంగా దేశంలో, రాష్ట్రంలో ఎలాంటి విపత్తులు వచ్చినా ఎదుర్కొనే శక్తివంతమైన నాయకత్వం ఉందన్నారు. దేశంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడి, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ రాష్ట్రంలోని పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని అన్నారు. గ్యాస్, పెట్రోల్ ఉత్పత్తులకు ఏవిధమైన కొరత లేదని మంత్రి మనోహర్ స్పష్టంగా చెప్పారన్నారు. రాష్ట్రంలోని ప్రజలు ఏవిధమైన అపోహలకు గురికాకుండా, వదంతులు విశ్వసించకుండా సాధారణంగానే గ్యాస్ బుకింగ్ చేసుకుంటే మూడు నాలుగు రోజుల వ్యవధిలోనే ఇంటికే గ్యాస్ సిలెండర్‌ను గ్యాస్ కంపెనీల సిబ్బంది తీసుకువచ్చి అందచేస్తారని చెప్పారు. ఒక వేళ ఏమైనా ఇబ్బందులు ఉంటే ప్రభుత్వమే అధికారికంగా ప్రకటన విడుదల చేస్తుందని ఎమ్మెల్యే గద్దె చెప్పారు. పొట్లూరి సాయిబాబు మాట్లాడుతూ సంజయ్‌గాంధీ కాలనీలో ని ప్రభుత్వ పాఠశాలలో అమలు అవుతున్న మధ్యాహ్న భోజన పథకం తీరును పరిశీలించడానికి తాము వెళ్ళినప్పుడు ఎమ్మెల్యే గద్దె ను మేరీ భవానీ కలిసి తన దుస్థితి గురించి తెలియజేసిందన్నారు. వారం రోజుల వ్యవధిలోనే ఎమ్మెల్యే గద్దె స్పందించి తన సొంత నిధులతో తోపుడు బండిని కొనుగోలు చేసి ఆమెకు అందచేస్తున్నారన్నారు. పేదలకు అవసరమైన సహాయాన్ని అందించడాన్ని నిత్యకృత్యంగా గద్దె చేస్తున్నారన్నారు. తోపుడు బండిని తీసుకున్న మేరీ భవానీ మాట్లాడుతూ తనకు జీవనోపాధికి కష్టంగా ఉందని ఎమ్మెల్యే గద్దె తెలియజేసిన వెంటనే స్పందించి సహాయం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. గతంలో కూడా ఎమ్మెల్యే గద్దె ద్వారా తాను సహాయం పొందానన్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ కరీం, గద్దె రమేష్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, మేదరమెట్ల నారాయణ, మాదాల రాజ్యలక్ష్మి, రాయణ, రమణ, సాయిన బుజ్జి, రాజనాల పవన్, తదితరులు పాల్గొన్నారు.

## అమరావతికి చట్టబద్దతను ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు

**10వ డివిజన్‌లో లబ్ధిదారులకు ఫించన్లు అందచేసిన ఎమ్మెల్యే గద్దె**



విజయవాడ, ఏప్రిల్ 1 (నేటి శుభోదయ):- ఆంధ్రుల ఏకైక రాజధాని అమరావతికి చట్టబద్ధతను రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాత్ర అమోఘమైనదని కొనియాడారు. బుధవారం ఉదయం తూర్పు లోని 10వ డివిజన్ ఆర్‌ఆర్ గార్డెన్స్ ప్రాంతంలో ఎమ్మెల్యే గద్దె పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను ఆయన స్వయంగా అడిగి తెలుసుకొని వాటిని పరిష్కరించాల్సిందిగా కార్పొరేషన్‌లోని ఆయా విభాగాల అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం డివిజన్‌లోని ఫించను లబ్ధిదారులకు గద్దె ఫించన్లను అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ అమరావతి రాజధానిగా ప్రకటిస్తూ లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టడం వెనుక ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి అమోఘమైనదని కొనియాడారు. 2027వ సంవత్సరం నాటికి అమరావతిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారని తెలిపారు. 201419 మధ్య ఐదు సంవత్సరాల కాలంలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అమరావతి పరిధిలో హైకోర్టు, అసెంబ్లీ, డీజీపీ కార్యాలయాలను నిర్మించి పాలన చేశారన్నారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చంద్రబాబునాయుడు నిర్మించిన అసెంబ్లీ భవనంలో నుంచే పాలన సాగించారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి పాలన సాగించిన ఐదు సంవత్సరాల్లో అమరావతిలో ఒక్క ఇటుక కూడా పెట్టకుండానే పాలన చేశాడని చెప్పారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరింత వేగంగా అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పనులు చేస్తున్నారని, రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించేందుకు నేడు లోక్‌సభలో బిల్లులో పెట్టనున్నారని చెప్పారు. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత రావడం ప్రజలందరూ కోరుకున్నారని గద్దె అన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేశక్తిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి ఆ దేవుడు ఇవ్వాలని గద్దె కోరుకున్నారు. దేవినేని అపర్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అంటేనే కొత్త ఆవిర్భాలకు పేరు అన్నారు. రోజుకు 18 గంటల పాటు కష్ట పడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్టాన్ని అభివృద్ధిని చేస్తూ ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉండటం మన అందరికి అదృష్టమని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరూ చాలా ఆనందంగా ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మన్నే జయప్రకాష్, పొలగాని జగన్‌మోహన్‌రావు, పేరేపి ఈశ్వర్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, రాజేష్, పి.దర్శిత్, బెజవాడ నజీర్, సీహెచ్.వాసు, రత్తయ్య, దండమూడి ఆజాద్, టి.వీరరాఘవయ్య, గుమ్మడి రామకృష్ణ, రాజేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ అయ్యప్ప స్వామి జన్మదినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి వెలంపల్లి



విజయవాడ, ఏప్రిల్ 1 (నేటి శుభోదయ):- శ్రీ అయ్యప్ప స్వామి జన్మదినోత్సవం సందర్భంగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో పలు చోట్ల నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలలో మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. వాగు సెంటర్ లోని వినాయకుడి గుడి వద్ద మణికంఠ భజన బృందం ఆధ్వర్యంలో శ్రీ అయ్యప్ప స్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వెలంపల్లి శ్రీనివాసరావు అయ్యప్ప స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సితార సెంటర్ లోని చా+టూ కన్వెన్షన్ లో దెందులూరు సూర్యనారాయణ (ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి జన్మదినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేసారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, భక్తులకు స్వామి వారి ప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వారి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

## చిత్తూరు డి యం హెచ్ ఓ గా నాగశశి భూషణ్ రెడ్డి




పులిచెర్ల, ఏప్రిల్ 1,(నేటి శుభోదయ) :చిత్తూరు జిల్లా నూతన వైద్యారోగ్య శాఖ అధికారిగా డా.నాగ శశి భూషణ్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిగా ఉన్న ఆయనకు డి యం హెచ్ ఓ గా పదోన్నతి లభించింది . ప్రస్తుత డి యం హెచ్ ఓ సుధారాణి విజయవాడలోని డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ శాఖకు బదిలీపై వెళ్లనున్నారు.

# మహిళలపై ఆగని వేధింపులు

ఖమ్మం, నేటి శుభోదయ ::: ఇటీవల కాలంలో ఒక యూట్యూబ్ ప్రేమించమని వేధించి చివరికి పెళ్లి చేసుకొని అత్తమామలు భర్త గర్భిణీ అని చూడకుండా దారుణంగా హత్య చేయడం జరిగింది. మరికొందరు రెండో పెళ్లి చేసుకొని అంతటి భార్యకు చెప్పకుండా వేధింపులు గురి చేయటం వల్ల పిల్లలతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వరకట్న వేధింపులకు గురి చేయటం కాకుండా నిలదీసిన అత్తమామలపై దాడి చేసి వారి మరణానికి కారణం అవుతున్నారు. కొందరు ఉపాధ్యాయులు చిన్నారులను చూడకుండా లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారు. ఇటీవల కాలంలో ఇటువంటి సంఘటన లు చాలాచోట్ల పునరావృతం అవుతున్నాయి. ఒక లెక్చరర్ స్టడీ స్టడీమెటీరియర్ ఇప్పిస్తానని ఇంటికి రప్పించుకుని లైంగిక దాడికి పాల్పడ్డాడు. భార్య భర్తలు ఇద్దరు బయటి పనులకు వెళుతూ తమ పిల్లలకు రక్షణగా ఉండమని బంధువులకు చెప్పి పెడితే చిన్న పిల్లల్ని పై లైంగిక దాడి చేసి వారి తల్లిదండ్రులకు ఎక్కడ చెబుతారని హతమార్చిన సంఘటనలు ఎక్కువ అవుతున్నాయి. ప్రేమ పేరుతో వంచన చేసి లైంగికంగా వాడుకొని మొహం చాటు వేస్తూ రెండో పెళ్లికి సిద్ధమవుతున్న ప్రబుద్ధులు కూడా ఉన్నారు. వారి ఇంటి ముందు ధర్నాలు చేస్తున్న సంఘటనలు కూడా ఉన్నాయి. ఒకవేళ తీసుకున్న వారికి కట్న వేధింపులు ఎదురవుతున్నాయి. ఇటీవల కాలంలో అత్యంత దారుణమైన విషయం కొందరు బాలురు స్కూల్ స్థాయిలో చదివే వారు టీనేజ్ కూడా నిండని వారు అభం శుభం తెలియని చిన్నారులపై లైంగిక దాడులు చేస్తున్నారు. బాల్య దశ నుండే కొన్ని అశ్లీల ఛానల్ లో ప్రభావం వల్ల చిన్నతనం లోని చెడు అలవాట్లకు ప్రభావితులై ఇటువంటి పాడు పనులకు పాల్పడుతున్నారు. కొందరైతే బాలికను కిడ్నాప్ చేసి అత్యంత దారుణంగా అత్యాచారం చేసి చంపి వేయటం లేదా బ్యాట్మెంట్ చేయడం జరుగుతోంది. కొందరు పోకిరిలు ఉద్యోగుల మహిళల ట్రాప్ చేసి వారిని పెళ్లి చేసుకొని వేధింపులకు గురి చేయటం కొన్నిచోట్ల జరుగుతోంది. ఒంటరిగా ఉన్న మహిళలు భర్త నుండి విడిపోయిన భర్త చనిపోయిన వారిని టార్గెట్ చేసి లైంగికంగా శారీరకంగా వేధిస్తున్నారు. ప్రేమ పేరుతో వేధిస్తూ ప్రేమించకుంటే దాడులు చేస్తున్న సంఘటన కూడా ఉన్నాయి. కఠినమైన శిక్షలు లేకపోవటం వలన రోజురోజుకీ మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయి. కొన్ని రాష్ట్రాలలో కఠినంగా వ్యవహరిస్తున్నారు మహిళలపై అత్యాచారం చేసిన వారిపై ఎన్కౌంటర్ చేస్తున్నారు. చట్టాలు కఠినంగా ఉన్నప్పుడే వీటిని నివారించ గలుగుతాం మహిళలకు రక్షణ కల్పించిన వారం అవుతాం అవుతాం.మహిళలు కూడా దీనికి అతీతులు కారు. కొందరు మహిళలు పెళ్లి చేసుకొని గతంలో ప్రేమ వ్యవహారాలు నడిపి అది మరువలేక భర్తలను హత్య చేస్తున్నారు. కొంతమంది తెలియని ఆకర్షణలకు గురై అనైతిక సంబంధాలు సహజీవన పేరిట సంబంధాలు ఏర్పరచుకొని భర్తలను పిల్లలను. దారుణంగా హత్య చేసిన సంఘటనలు ఎదురవుతున్నాయి. కొందరు మోసపోవడమే కాక భర్తను మోసం చేసిన వారు రెంటికి చెడ్డ రేవడిగా చివరకు ఆత్మహత్యలు పాల్పడిన సంఘటన కూడా ఉన్నాయి. పెళ్లి పేరిట కొందరు యువతులు ముగ్గులోకి దించి నగలతో డబ్బుతో కూడా ఊడాయించిన సంఘటనలు ఉన్నాయి. కొందరు మహిళలు నిత్య పెళ్లికూతురు అవతారం ఎత్తి ఒకరికి తెలియకుండా ఒకరిని పెళ్లి చేసుకుని డబ్బు ధస్కంతో కూడా ఇస్తున్నారు. ఇటీవల ఇటువంటి నిత్య పెళ్లికూతుళ్లను అరెస్టు చేసిన సంఘటన కూడా ఉన్నాయి. నిత్య పెళ్లి కూతుర్లు నిత్య పెళ్లి కొడుకులు మాట్రిమోనియం తప్పుడు సంపాదించడం ఇచ్చి వివాహం చేసుకొని సంఘటనలు ఉన్నాయి. వీరి పట్ల మ్యాట్రిమోనియం వారు కూడా అప్రమత్తంగా ఉండాలని కొందరు కోరుతున్నారు. మరో విచిత్రం ఏమిటంటే కొందరు యువకులు ఆదర్శం వివాహం పేరిట హిజ్రాలను పెళ్లి చేసుకొని డబ్బులను నగలను జల్సాలకు వాడుకొని వారిని వదిలించు కోవాలని చూస్తున్నారు. వీరిపై కూడా అప్రమత్తంగా ఉండాలి. మోసా లు అత్యాచారాలకు అమానుషాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలి శిక్షలు త్వరితగతన విధించాలి అప్పుడే సమాజంలో మార్పు రాగలరు దీనికి ఎవ్వరు అతీతులు కాకూడదు.

# అష్టావధానిసురభికి ఉగాది జాతీయ సాహిత్యపురస్కారం

విజయవాడ, హైదరాబాద్, ఏప్రిల్ 1 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, మనంఫౌండేషన్ శ్రీపరాభవఉగాది జాతీయపురస్కారాల సభ రవీంద్రభారతిలో మంగళవారం ఘనంగా నిర్వహించింది. ఈసందర్భంగా వివిధరంగాల ప్రముఖులను ఘనంగాసత్కరించింది. మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలాచారి, విశ్రాంత జిల్లాప్రధానన్యాయమూర్తి నేరెళ్ళమాల్యాద్రి, సినీదర్శకులు రేలంగినరసింహారావు, అష్టావధాని సురభి శంకరశర్మ, తదితరులు అతిథులు గాపాల్గొన్నారు. మనం వ్యవస్థాపకులు అధ్యక్షులు చక్రవర్తి మాట్లాడుతూ నేటి పురస్కారాలందుకున్న ప్రముఖులందరూ పరాభవను విజయాభ వ సూచకంగా భావించి వారి వారి రంగాలలో విశేషంగా కృషిచేసి సామాజిక దేశసేవ ధ్యేయంగా ముందుకు సాగాలన్నారు .వేణుగోపాలాచారి మట్లాడుతూ పురస్కారగ్రహీతలను అభినందిస్తూ జాతి శ్రేయస్సు, సమాజాభ్యుదయం , ప్రస్తుత దేశసమస్యలపట్ల అవగాహన, ప్రతిఒక్కరి బాధ్యత కావాలన్నారు.రేలంగి ప్రసంగిస్తూ, ఆసక్తి ఉంటే, ఆశక్తి వస్తుందని ,కవులు కళాకారులు సంఘసేవకులపాత్ర దేశఉజ్వల భవితకు ఎంతో





దోహదమౌతుందన్నారు. సురభి మాట్లాడుతూ, కృషిచేసేదేరంగమైనా సరే పవిత్రత ,ఐక్యత, నిబద్ధత, స్పష్టత, ఉండాలన్నారు. సురభికి జాతీయ సాహిత్యపుస్కారం. ఉభయ తెలుగు రాష్ట్రాలలో నేకాకుండా తమిళనాడు ,కర్ణాటక, మహారాష్ట్ర, తదితరప్రాంతాలలో 217అవధానాలు చేశారు . అవధానధుని అభినవ భర్తృహరి, అవధానసురభి, బిరుదులందుకొన్నారు. అవధానరంగంలో తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం , అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావుచే రవీంద్రభారతిలో సత్కారం , ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ స్టేట్ యూత్అవార్డ్ ,పద్మశ్రీ శోభారాజ్ చే అన్నమయ్య సాహితీపురస్కారం, విజయవాడ సిద్ధార్థ మహిళా కళాశాల గిడుగువారి పురస్కారం , నెహ్రూ యువకేంద్ర వివేకానంద యువశక్తి సాహితీపురస్కారం అందుకున్నారు. ఆంధ్ర తెలంగాణ కర్ణాటక వివిధప్రాంతాలలో పలుసాహిత్యసంస్థలచే సాహిత్య పురస్కారాలందు కొన్నారు. అప్పటిగవర్నర్లు కృష్ణకాంత్ నరసింహన్‌రోశయ్యలచే సన్మానాలందుకొన్నారు. అధ్యాపకునిగా జిల్లా ప్రభుత్వ పురస్కార మందుకున్న సురభి పలు టీవీ మాధ్యమాలలో తమసేవలందించారు. టీవీ9, సంస్కృతి, సీవిఆర్, ఆస్థా, యోగి, పియమ్ సి ,చానెళ్ళలో సమున్నత కార్యక్రమాలు నిర్వహించారు. పద్యాలతోరణం వేదికగా సామాజిక శతక పద్యహేలకు పిలుపునిచ్చి నూటయాభై శతకరచనలకు ప్రేరకులయ్యారు. కవిగా అవధానిగా, వ్యాఖ్యాతగా సభానిర్వాహకునిగా,ప్రవచనకర్తగా , సాహితీవేత్తగా, వివిధమాధ్యమాల ప్రతినిధిగా, విశేషసేవలనందిస్తున్నసురభి ఇంకా విశిష్ట విజయాలందుకోవాలని ఆశిద్దాం.



## అయోధ్యను తలపించిన కళ్యాణ వేదిక కళాకృతులు

**- తెలుగుదనం ఉట్టిపడేలా రాములవారి కల్యాణ వేదిక**

**- ప్రత్యేక ఆకర్షణగా యాక్రిలిక్ పెయింటింగ్**



ఒంటిమిట్ట, ౧ ::: ఒంటిమిట్టలో జరిగిన శ్రీ సీతారాముల కల్యాణం కోసం టీటీడీ ఉద్యానవన భాగం ఆధ్వర్యంలో తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా త్రేతాయుగంనాటి అయోధ్యను గుర్తుకు తెచ్చేలా కల్యాణవేదికను అందంగా తీర్చిదిద్దారు.వేదిక రంగురంగుల పుష్పాలతో చూపరులకు ఆహ్లాదాన్ని పంచింది . వేదికపై, ప్రాచీన ఆలయాలలోని దశావతారాల సెట్టింగు, రామాయణంలోని ఘట్టాలతో యాక్రిలిక్ పెయింటింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సీతారాముల కల్యాణాన్ని వీక్షించేందుకు వచ్చిన భక్తులు పుష్పాల అలంకరణ చూసి ముగ్ధులయ్యారు. తెలుగుదనం ఉట్టిపడేలా చెరుకులు, టెంకాయ గెలలు, టెంకాయపూత, అరటి ఆకులు, మామిడాకులు, హెలికానియమ్స్, టార్చ్ జింజర్, నీలం ఆర్కిడ్, రెడ్ ఆంథూరియం తదితర విదేశీ జాతుల పుష్పాలతో కల్యాణవేదికను అలంకరించారు. ఇందుకోసం 5 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 50 వేల కట్ ఫ్లవర్స్ వినియోగించారు. అదేవిధంగా ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో నాలుగు టన్నుల సంప్రదాయ పుష్పాలు, 30 వేల కట్ ఫ్లవర్స్ తో అత్యద్భుతంగా పుష్పాలంకరణలు చేపట్టారు. టీటీడీ ఉద్యానవన విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసులు పర్యవేక్షణలో రెండు రోజులపాటు 100 మంది అలంకరణ నిపుణులు, మరో 100 మంది టీటీడీ సిబ్బంది ఇందుకోసం పనిచేశారు.

## ఎన్ డబ్ల్యూ డబ్ల్యూ టి

## - ఐ ఓ ఎం ప్రాజెక్ట్ బృందంతో సమావేశం ఏర్పాటు

**నిజామాబాద్ జిల్లా రూరల్ ప్రతినిధి భీమ్ గల్ పట్టణం**

(నేటిశుభోదయ) ఏప్రిల్ 01.:భీమ్ గల్ మండలం బాలాపూర్ గ్రామంలో సోమవారం ఎన్ డబ్ల్యూ డబ్ల్యూ టి - ఐఓఎం ప్రాజెక్ట్ బృందం ఎఎతీఎ (మొబైల్ మైగ్రేషన్ రిసోర్స్ సెంటర్) మొబైల్ వ్యాన్ ద్వార కమ్యూనిటీ సమావేశం నిర్వహించింది, సమావేశంలో, లేబర్ కార్డుల దరఖాస్తులు, ప్రయోజనలపై అవగాహన, ఎంఆర్ సి నిజామాబాదు సేవలు, ప్రవసి హెల్ప్ లైన్ 18005991393 ప్రమోషన్, యువత, మహిళల కోసం నైపుణ్య శిక్షణ సమాచారం పంచుకున్నరు. పిఎంజెజెవై, పిఎంఎస్ బివై పథకల గురించి చర్చించారు. సురక్షిత వలస, లేబర్ కార్డు కోసం ఎలా దరఖాస్తు చేసుకోవలి. ఎమిగ్రేట్ ఆప్ వీడియో మానసిక సామాజిక సహాయ లైన్ ఇ-పోస్టర్, వాతవరణ మార్పు సమాచారం గ్రామసర్పంచ్ సమీర్, ఉపసర్పంచ్ మంద గోవర్ధన్, వార్డు సభ్యులు కమ్యూనిటీ సమావేశనికి హాజరై గ్రామ పౌరులు, స్వయం సహాయక బృందం మహిళలు, వలస కుటుంబలను ఉద్దేశించి ప్రసంగించారు. ఎన్ డబ్ల్యూ డబ్ల్యూ టి - ఐఓఎం ప్రాజెక్ట్ టీం హైదరాబాద్ నుండి, బాలకృష్ణ, వంశీ, శివ పాల్గొనడం జరిగిందిని తెలిపారు.

## విద్యార్థినులకు దుస్తుల వితరణ

కొణిజర్ల, నేటి శుభోదయ ::: కొణిజర్ల మండలం అన్నవరం లోని ప్రాథమిక పాఠశాలలో 1 నుండి 5 వ తరగతి చదువుతున్న విద్యార్థినులకు స్థానిక ఎన్జీవో గా పనిచేస్తున్న శిల్ప దాతల సహకారంతో దుస్తులను వితరణ చేశారు.ఇవేగాక పాఠశాలలోని విద్యార్థులకు ఉచితం గా చిత్రలేఖనం నేర్పించడమే గాక బాలవికాస్ తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శిల్ప ను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

## బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షుడిగా సత్యమూర్తి

సాధనాల వీరేంద్ర కూకట్పల్లి ఏప్రిల్ 01, 2026.:తెలంగాణ వాసి వేముల సత్యమూర్తి, 'బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి మంగళవారం ముంబైలో ప్రకటించారు. ఈ సందర్భంగా వేముల సత్యమూర్తి మాట్లాడుతూ కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, వాటికి పరిష్కారాలను కనుగొనడానికి కృషి చేస్తానని తెలిపారు. సామాన్య మధ్య తరగతి ప్రజలు కూడా సొంతింటి కల నెరవేర్చేందుకు పడుతున్న తరుణంలో ఎన్నో ఇబ్బందులు ఉనయని నిర్మాణ రంగంలో వారికి కూడా తగిన సలహాలు ఇస్తానని హామీ ఇచ్చారు. 'బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' జాతీయ ఉపాధ్యక్షుడిగా తాను ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు ఆయన కృతజ్ఞతలు కూడా తెలియజేశారు.

## ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసిన మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మం,:: ఖమ్మంలో మహిళలకు ఉచిత చీరలు ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ" కార్యక్రమం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. 26వ డివిజన్ సుగ్గులవారి తోటలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర పాలక సంస్థ మేయర్ పునుకొల్లు నీరజ అర్హులైన మహిళలకు ఉచితంగా ఇందిరమ్మ చీరలను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. డ్వాక్రా సభ్యులే కాకుండా అర్హత కలిగిన ప్రతి మహిళకు చీరలు అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. నేటి నుంచి నగరంలోని అన్ని డివిజన్లలో ఈ చీరల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఉప మేయర్ ఫాతిమా జోహర ముక్తార్, ఉప కమిషనర్ శ్రీనివాస్, సహాయ కమిషనర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు. అలాగే మెప్మా టీఎంసీ సుజాత,డివిజన్ నాయకులు బొడ్డుబోయిన శ్రీను, కనకరాజు ప్రసాద్, యాకూబ్, బుజ్జి, మాధవి, సైదా, సలీం, మదర్,ఆర్ పి లు తదితరులు హాజరయ్యారు.

## త్రివేణి లో అంధత్వ నివారణ వారోత్సవాలు

ఖమ్మం,::: స్థానిక త్రివేణి ఉన్నత పాఠశాలలో అంధత్వ నివారణ వారోత్సవాలు సందర్భంగా ప్రముఖ కంటి శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ నంద నందన్ పాల్గొని విద్యార్థిని విద్యార్థులకు దీర్ఘ దృష్టి, హ్రస్వ దృష్టికి సంబంధించి పలు సూచనలు చేశారు అలాగే ఆహారపు అలవాట్లను మార్చుకోవడం ద్వారా దృష్టిని పెంచుకోవచ్చని తద్వారా దృష్టిలోపం లేకుండా చూసుకోవచ్చని తెలియజేశారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మనకున్న పంచ జ్ఞానేంద్రియాలలో కన్ను అతి ముఖ్యమైనదని, అలాగే ప్రతి ఒక్కరు కూడా చరవాణి వాడేటప్పుడు స్క్రీన్ టైం తక్కువ చేసుకున్నట్లైతే కంటి చూపు మెరుగవుతుందని తెలియజేశారు. ఈ వారోత్సవాలలో పాఠశాల సి ఆర్ ఓ కాట్రగడ్డ మురళి కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ ముస్తఫా, స్వప్న, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, ట్రాన్స్పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## 10 న 'జై ఎన్టీయార్ జయహో బాలయ్య'

**- మొగిలి ఎంటర్టైన్మెంట్స్ తెలుగు జాతి గుండె చప్పుడు**

ఖమ్మం కల్చరల్,: మొగిలి ఎంటర్టైన్మెంట్స్ సమర్పణలో ఈ నెల 10 న ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రం వేదికగా జై ఎన్టీయార్-జయహో బాలయ్య శీర్షికన తెలుగు జాతి గుండె చప్పుడు వినిపించబోతోంది. విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నటరత్న నందమూరి తారక రామారావు,సినీ హీరో నందమూరి బాలకృష్ణ డూప్ లు ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణ కానున్నారు.అనేక ప్రదర్శనలిచ్చి అశేష నందమూరి అభిమానులచేత కితాబులందుకున్న ఈ డూప్ ల విన్యాసాలు పంచ్ డైలాగులు ఖమ్మం ప్రేక్షకులను ఆకట్టుకుంటాయని సంస్థ వ్యవస్థాపక అధినేత మొగిలి గుణకర్ తెలిపారు. అదేవిధంగా గాయకులు వీవీరెడ్డి,లక్ష్మీనారాయణ,గణపతిరాజు,రామారావు కావేరి,దాస్,నాగభూషణం,మోజీ లక్ష్మణ్ , భిక్షం, స్వప్న,కీర్తి,స్నేహ,చైతన్య లచే సంగీత విభావరి నిర్వహించనున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ నాగసాయి,న్యాయవాది గరికె సంపత్ కుమార్,కమేడియన్ జల్లేపల్లి రమేష్,దర్శకుడు రవితోప్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర వ్యాప్తంగా మీ సేవ కొత్త రుసుములు అమల్లోకి

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి చిలుక విజయకుమార్ ఏప్రిల్ 01:జిల్లా మీసేవ వినియోగదారులకు ముఖ్య గమనిక రాష్ట్ర ప్రభుత్వ తాజా ఆదేశాల ప్రకారం ఏప్రిల్ 01 నుంచి మీసేవ సేవలపై కొత్త చార్జీలు అమలులోకి వచ్చాయి.దీంతో గతంలో కంటే ప్రస్తుతం సేవల రుసుముల్లో మార్పులు చోటుచేసుకున్నాయి.అందువల్ల వినియోగదారులు పాత చార్జీలతో పోల్చి సందేహాలు వ్యక్తం చేయకుండా,ప్రభుత్వం నిర్ణయించిన తాజా రుసుములను చెల్లించి సహకరించాలని జిల్లా మీసేవ అధ్యక్షులు సితారే క్షేవిన్ (రాజ్ ) విజ్ఞప్తి చేస్తున్నారు.'

## ఇరాన్ యుద్ధం మా దేశాన్ని ప్రభావితం చేస్తుంది



లండన్ : ఇరాన్ యుద్ధం భవిష్యత్తులో తమ దేశంపై తీవ్ర ప్రభావం చూపుతుందని బ్రిటన్ ప్రధాని స్టార్మర్ హెచ్చరించారు. అలాగే యుద్ధం వల్ల సంభవించే ఆర్థిక పర్యవసానాలను తట్టుకోవడానికి బ్రిటన్ సిద్ధంగా ఉందని, ఈ తుఫాను ఎంత భయంకరమైనదైనా, దాన్ని తట్టుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కూడా ఆయన నొక్కి చెప్పారు. ఇది మా యుద్ధం కాదు అని ఆయన అన్నారు. కానీ అది వారి జాతీయ ప్రయోజనాలకు విరుద్ధమని, ఇందులో తాము జోక్యం చేసుకోబోమని ప్రధాని పునరుద్ఘాటించారు. బ్రిటన్‌లో జీవన వ్యయం విపరీతంగా పెరగడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిటన్‌లో జీవన వ్యయం తగ్గాలంటే.. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలను తగ్గించడానికి ఒత్తిడి తేవడమేనని ఆయన అన్నారు. అందుకుతగ్గట్టుగా తమకు అందుబాటులో ఉన్న ప్రతి దౌత్య మార్గాన్ని అన్వేషిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చొరబాటుదారులకు రక్షణ కల్పించేందుకు చట్టాన్ని తెస్తుంది : మోడీ



గౌహతి : అస్సాంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. చొరబాటుదారులకు రక్షణ కల్పించేందుకు చట్టాన్ని తీసుకు వస్తుంది. అయితే దీనిని బిజెపి, దాని మిత్రపక్షాలు అనుమతించవని ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. నేడు అస్సాంలో ధేమాజీ జిల్లాలోని గోగాముఖలో జరిగిన ఎన్నికల ర్యాలీలో మోడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'మెజారిటీ వర్గాన్ని మైనారిటీగా మార్చి, చొరబాటుదారుల శాశ్వత ఓటు బ్యాంకును సృష్టించడమే కాంగ్రెస్ లక్ష్యం' అని ఆయన అన్నారు. అస్సాంలో చొరబాటుదారులకు రక్షణ కల్పించేందుకు కొత్త చట్టం తీసుకువస్తామని కాంగ్రెస్ నేతలు బహిరంగంగా చెబుతూ, వారికి మద్దతు ఇస్తున్నారు అని ప్రధాని ఆరోపించారు. దేశ విభజన సమయంలో ముస్లిం లీగ్ చేసిన విధంగానే, ఆ పురాతన పార్టీ కూడా దేశాన్ని విభజించడానికి ప్రయత్నిస్తోంది. బాబా సాహెబ్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని కూడా కాంగ్రెస్ ఛిద్రం చేసింది అని మోడీ ఆరోపించారు. బిజెపి తిరిగి అధికారంలోకి వస్తే, అస్సాం గుర్తింపు కాపాడటానికి ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తుందని, ఆరవ షెడ్యూల్ కింద గిరిజనులకు రక్షణ కల్పిస్తుందని ప్రధాని అన్నారు. బిజెపి హయాంలో పదేళ్ల ప్రభుత్వ పాలన సేవ- సుపరిపాలన యుగంగా అభివర్ణించారు. మొదట సర్బానంద సోనోవాల్ నాయకత్వంలో, ఆ తర్వాత బిస్వా శర్మ మార్గదర్శకత్వంలో గత పదేళ్లలో అస్సాం సేవ, సుపిపాలనలో ఒక కొత్త శకానికి సాక్ష్యంగా నిలిచింది. అభివృద్ధి చెందిన భారతదేశం కోసం, అభివృద్ధి చెందిన అస్సాంను నిర్మించే ఎన్నికలే ఈ అస్సాం ఎన్నికలు. ఈసారి, బిజెపి-ఎన్‌డిఎ ప్రభుత్వానికి హ్యాట్రిక్ ఖాయం. అలాగే కాంగ్రెస్‌కు హ్యాట్రిక్ పరాజయమే కాకుండా.. వారి 'యువరాజు' ఓటముల్లో సెంచరీని పూర్తి చేసుకోబోతున్నారని మోడీ ఎద్దేవా చేశారు. ఈ పర్యటన సందర్భంగా మోడీ టీ తోటలకు వెళ్లి మహిళలతో ముచ్చటించారు. ఫొటోలకు ఫోజులిచ్చారు.

## ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం



అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. బుధవారం పార్లమెంట్ సమావేశంలో బిల్లుపై దాదాపు రెండు గంటల పాటు చర్చ జరిగింది. కూటమికి చెందిన టీడీపీ, బీజేపీ, జనసేన సభ్యులతోపాటు వైసీపీ సభ్యులు మినహా ఇతర పార్టీలకు చెందిన సభ్యులు మద్దతు పలికారు. దీంతో అత్యధిక సభ్యుల మద్దతు ప్రకారం చైర్మన్ ఆమోదం తెలుపడంతో సభ్యులు హర్షధ్వనాలు వ్యక్తం చేశారు. గురువారం రాజ్యసభలో బిల్లును ప్రవేశ పెట్టనున్నారు. ఈ సందర్భంగా వైసీపీ సభ్యులు ఈ తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. ప్రస్తుత స్థితిలో ఉన్న బిల్లుకు తాము వ్యతిరేకమని వైసీసీ పార్లమెంట్ సభ్యుడు మిథున్‌రెడ్డి తెలిపారు. రాజధానిని ఎప్పటివరకు నిర్మిస్తారో ప్రభుత్వం స్పష్టంగా చెప్పడం లేదని పేర్కొన్నారు. రైతుల వద్ద నుంచి సుమారు 54 వేల ఎకరాలు సేకరించారని వెల్లడించారు. రాష్ట్ర విభజన తరువాత ఏపీకి కొత్త రాజధాని అవసరం ఏర్పడిందని బీజేపీ సభ్యురాలు పురందరేశ్వరి అన్నారు. రాజధాని నిర్మాణానికి నాడు ప్రధాని మోడీ శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. రాజధాని లేని రాష్టంగా ఏపీ తన ప్రస్థానాన్ని ప్రారంభించిందని ఆందోళన వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో రాజధాని అంశం అస్థిరత ఏర్పడిందని పేర్కొన్నారు. అమరావతి రాజధాని కోసం 29 వేల మంది రైతులు తమ భూములను ఇచ్చేందుకు ముందుకు వచ్చారని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత రాజధానిగా అమరావతి ఉంటుందని స్పష్టం చేశారు.

## తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం




హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పాఠశాల విద్యార్థులకు స్పెషల్ కిట్ పంపిణీ చేయనున్నారు. 21 వస్తువులతో స్కూల్ కిట్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే కలర్ యూనిఫామ్ అమలు చేయాలని కూడా సర్కార్ నిర్ణయించింది. వచ్చే అకాడమిక్ ఇయర్ నుంచి అమలు చేసే యోచనలో ప్రభుత్వం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రభుత్వ వ్యవస్థల్లో మొత్తం 26 లక్షల మంది విద్యార్థులు చదువుతుండగా.. రెసిడెన్షియల్ పాఠశాలల్లో 19 లక్షల మంది ఉన్నారు.

# ఈజ్ ఆఫ్ లివింగ్ సిటీ

### దేశవ్యాప్తంగా మెట్రో నగరాలను దాటేసిన హైదరాబాద్

### అత్యంత నివాసయోగ్య నగరంగా టాప్‌ప్లేస్

### తాజాగా విడుదలైన 'వుయ్ ఆర్ సిటీ--2026'నివేదిక స్పష్టీకరణ



జీవన సౌలభ్యాన్ని అంచనా వేయడానికి నిర్వహించిన అధ్యయనంలో సిటీ టాప్ ప్లేస్‌ను కైవసం చేసుకుంది. ఈజ్ ఆఫ్ లివింగ్‌లో నెంబర్ వన్‌గా నిలిచింది. రియల్ ఎస్టేట్ వృద్ధి, రవాణాసౌకర్యం, ఆహ్లాదకరమైన వాతావరణాలతోపాటు వే ర్వేరు విభాగాల్లో 15 కొలమానాల ఆధారంగా దేశంలోని ఎనిమిది మెట్రో నగరాల్లో ఈ అధ్యయనం నివేదిక రూపొందింది. ఈ కొత్త నివేదిక ప్రకారం, భారతదేశంలో అత్యంత 'నివాసయోగ్యమైన'మ హానగరంగా బెంగళూరును అధిగమించి హైదరాబాద్ నిలిచింది.

### నివేదిక నేపథ్యం...

బెంగళూరుకు చెందిన స్వచ్ఛంద సంస్థ అన్‌బాక్సింగ్ బీఎల్‌ఆర్((బెంగుళూరు నగరం యొక్క కళలు, సంస్కృతి, సాంకేతికత మరియు వారసత్వాన్ని ప్రదర్శించే ఓ వార్షిక వేడుక) ప్రచురించిన 'వుయ్ ఆర్ సిటీ--2026'వార్షిక నివేదిక ఈ వివరాలు వెల్లడించింది. ఇటీవల నిర్వహించిన ఇండియాస్పోరా గ్లోబల్ ఏఐ సదస్సులో ఈ డేటా నివేదికను విడుదల చేశారు. 'సిటీ ఇండెక్స్'పేరిట వెలువరించిన 159 పేజీల నివేదికలో, ప్రయాణం, వైవిధ్యం, అవుటింగ్, గృహవసతి, మౌలిక సదుపాయాలు చివరగా వాతావరణం వంటి కొలమానాలను ఉపయోగించి జీవన సౌలభ్యం ఆధారంగా ఎనిమిది నగరాలకు ర్యాంకులు ఇచ్చారు. ఈ ర్యాంకుల ప్రకారం ఉద్యోగాలు, వినియోగం, రవాణా వంటి అంశాల్లో రెండు టెక్ హబ్‌లు హైదరాబాద్, బెంగుళూర్‌లు భారతదేశ వృద్ధికి చోదకశక్తిగా నిలుస్తున్నాయని ఈ నివేదిక తేల్చి చెప్పింది. జనాభాపరంగా ముంబై, ఢిల్లీ ఎంతో పెద్దవైనప్పటికీ ఆర్థిక వృద్ధిలో మాత్రం ఈ రెండు నగరాలు వాటిని మించిపోతున్నాయి.

### సిటీ ర్యాంక్‌ను పెంచిన వైవిధ్యం...

గృహ వసతి, జీవన వైవిధ్యం వంటి అంశాలు హైదరాబాద్ ర్యాంకింగ్‌ను పెంచగా, ప్రయాణ సమయం మౌలిక సదుపాయాలు బెంగళూరును రెండవ స్థానానికి నెట్టాయి. ఒక్కో విభాగంలో ఒక్కొక్క నగరం సత్తా చాటినప్పటికీ మొత్తం మీద హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచింది ఆ తర్వాతి స్థానాల్లో బెంగళూరు కోల్‌కతా నిలిచాయి. అహ్మదాబాద్ అట్టడుగున నిలవగా, చెన్నై, ఢిల్లీ ఎన్‌సిఆర్, పూణే, గ్రేటర్ ముంబై వరుసగా నాలుగవ, ఐదవ, ఆరవ మరియు ఏడవ స్థానాల్లో నిలిచాయి. కొత్త కంపెనీల ఏర్పాటు, గ్రేడ్--ఎ ఆఫీస్ స్పేస్‌లు జీసీసీ సెటప్‌ల వంటి రంగాలలో హైదరాబాద్ బెంగళూరుకు సవాలుగా ఎదుగుతోందని కూడా నివేదిక తెలిపింది.

# బెంగాల్ దీదీకి 'సరిహద్దు' సెగ

### సెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ఎజెండాగా మారిన చొరబాట్లు

### హిందువుల ఓట్లను సంఘటితం చేస్తున్న బీజేపీ

### సీఏఏ అమలు, 'మతువా'ల పౌరసత్వంపై కమలనాథుల ఆశలు

### సంక్షేమ పథకాలు, మైనార్టీ ఓట్ల ఏకీకరణను నమ్ముకుంటున్న మమతా బెనర్జీ

దేశ రాజకీయాల్లో ఎప్పుడూ ఆసక్తి రేపే పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రణరంగాన్ని ఈసారి పొరుగు దేశమైన బంగ్లాదేశ్ పరిణామాలు ప్రభావితం చేస్తున్నాయి. వరుసగా నాలుగోసారి అధికార పీఠాన్ని దక్కించుకోవాలని తహతహలాడుతున్న ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి సరిహద్దు అంశాలు తలపోటుగా మారాయి. చొరబాటు అస్త్రాన్ని సంధించి ఎలాగైనా దీదీ కోటలో పాగా వేయాలని బీజేపీ కంకణం కట్టుకుంది. బెంగాల్‌కు బంగ్లాదేశ్‌తో 2,216 కిలోమీటర్ల మేర సుదీర్ఘ సరిహద్దు ఉంది. ఇప్పుడు బెంగాల్ రాజకీయాలకు ఇదే కేంద్ర బిందువుగా మారింది.

### చొరబాట్లు కేంద్రం వైఫల్యమే..

సరిహద్దు గుండా శరణార్థులు, చొరబాటుదారుల రాక భారీగా పెరిగిందని, ఇది రాష్ట్ర జనాభా ముఖచిత్రాన్ని మార్చేస్తోందంటూ బీజేపీ తీవ్రస్థాయిలో ప్రచారం చేస్తోంది. జాతీయ భద్రతకు ముప్పు పొంచి ఉందని చెబుతూ హిందువుల ఓట్ల ఏకీకరణకు ప్రయతి?నస్తోంది. మరోవైపు, అధికార తృణమూల్ కాంగ్రెస్ ఈ ఆరోపణలను తిప్పికొడుతోంది. సరిహద్దుల భద్రత చూసుకునే బీఎస్‌ఎఫ్ కేంద్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంటుందని, చొరబాట్లు జరిగితే అది కేంద్రం వైఫల్యమేనని సీఎం మమతా బెనర్జీ వాదిస్తున్నారు. బంగ్లాదేశ్‌తో ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను గుర్తుచేస్తూ, చొరబాట్ల పేరుతో బెంగాలీలను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఆమె తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సరిహద్దు జిల్లాల్లో రైతులను ప్రభావితం చేసే 'తీస్తా నదీ జలాల పంపిణీ'వివాదం కూడా ఈ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించనుంది.

### 'మతువా'ల చుట్టూ రాజకీయ చదరంగం

బెంగాల్‌లో దాదాపు 17 శాతం ఉన్న దళిత (నామశూద్ర) 'మతువా'సామాజిక వర్గం ఉత్తర 24 పరగణాలు, నదియా లాంటి సరిహద్దు జిల్లాల్లో సుమారు 30 నుంచి 40 అసెంబ్లీ స్థానాల్లో గెలుపోటములను శాసించగలదు. దశాబ్దాల క్రితం బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన వీరు భారత పౌరసత్వం కోసం ఎదురుచూస్తున్నారు. పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) కింద అధికారికంగా పౌరసత్వం కల్పిస్తామంటూ బీజేపీ ఇచి?చన హామీ వారిని ఆకర్షిస్తోంది. అయితే, సీఏఏ, ఎన్‌ఆర్‌సీలను బెంగాల్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ అమలు చేయబోమని టీఎంసీ చెబుతోంది. మతువాలు ఇప్పటికే భారత పౌరులని దీదీ వాదిస్తున్నారు. సీఏఏ బీజేపీకి అస్త్రంగా మారింది. దీదీ మాత్రం సంక్షేమ పథకాలు, మైనారిటీ ఓట్ల ఏకీకరణపై ఆశలు పెట్టుకున్నారు.



### సరిహద్దు జిల్లాల్లో పెరిగిన ముస్లిం జనాభా

బంగ్లాదేశ్ సరిహద్దు వెంబడి ఉన్న 7 జిల్లాల్లో ప్రతి ఏటా దాదాపు 5 వేల చొరబాటు కేసులు నమోదవుతున్నాయి. గుర్తించని చొరబాట్లు ఇంకా ఎన్నోరెట్లు ఉంటాయి. సరిహద్దు జిల్లాల్లోని కొన్ని నియోజకవర్గాల్లో ముస్లింల జనాభా 40 శాతం నుంచి 70 శాతం వరకు పెరిగింది. ముర్షిదాబాద్, మాల్డా జిల్లాల్లో ముస్లిం జనాభా 50 శాతానికిపైగా ఉండగా, దక్షిణ 24 పరగణాలు వంటి జిల్లాల్లో 40 శాతం వరకు ఉంది. అక్రమ చొరబాట్ల వల్లే ముస్లింల జనాభా పెరిగినట్లు బీజేపీ ఆరోపిస్తోంది. ముస్లింలను భయపెట్టే రాజకీయాలు చేస్తున్నారని, బెంగాల్ సంస్కృతి, ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నం సాగుతోందని తృణమూల్ కాంగ్రెస్ ఆక్షేపిస్తోంది.


### పెండింగ్‌లో 40 లక్షల ఎస్ఐఆర్ కేసులు

ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)లో భాగంగా సుమారు 25 లక్షల ఓటర్ల కేసులు పరిష్కారం కాగా, ఇంకా 40 లక్షల కేసులు పరిశీలనలోనే ఉండటం రాజకీయ చర్చకు దారితీసింది. సరిహద్దు జిల్లాలైన ముర్షిదాబాద్‌లో 12 లక్షల కేసులు, మాల్డాలో 8 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. మిగిలిన వివాదాస్పద ఓటర్లలో 20 లక్షల మంది ఉత్తర 24 పరగణాలు, దక్షిణ 24 పరగణాల జిల్లాల్లో ఉన్నారు.

### సరిహద్దు జిల్లాల్లో పరిస్థితి ఇలా..

జనాభాలో సగానికి పైగా ముస్లింలు ఉండే ముర్షీదాబాద్, మాల్డా జిల్లాలు ఒకప్పుడు కాంగ్రెస్‌కు కంచుకోటలు. కానీ, ఇప్పుడు టీఎంసీ పాగా వేసింది. ఇక్కడ హిందువుల ఓట్లను సంఘటితం చేయాలని బీజేపీ, పాత ఓటు బ్యాంకును కాపాడుకోవాలని వామపక్ష కూటమి యతి?నస్తున్నాయి. రాజ్‌బన్షీలు, గూర్ఖాలు, తేయాకు తోటల కారి?మకులు ఉన్న ఉత్తర బెంగాల్ (కూచ్ బెహార్, జల్పాయ్‌గురి, డార్జిలింగ్) భౌగోళికంగా, సాంస్కృతికంగా భిన్నమైనది. ఇక్కడ ప్రత్యేక రాష్ట్ర డిమాండ్లు సజీవంగా ఉన్నాయి. ఈ ప్రాంతం కొన్నేళ్లుగా బీజేపీకి ఆయువుపట్టుగా మారింది. సుందర్బన్స్ అటవీ ప్రాంతంతో కూడిన దక్షిణ 24 పరగణాల జిల్లా టీఎంసీకి అభేద్యమైన కోట అనడం సబబు. మైనార?టలు, గ్రామీణ పేదలు ఎక్కువగా ఉండటం, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రభావంతో ఇక్కడ ఏ ఎన్నికలైనా సరే టీఎంసీ విజయం సాధిస్తోంది. స్థానికంగా బీజేపీ ఇంకా బలపడాల్సి ఉంది.

# అస్పష్టత..ఇంకానా?




ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు శాసనసభలో తీర్మానించడం స్వాగతించదగినది. ప్రభుత్వం మారితే రాజధానిని మార్చుకోవచ్చన్న తలంపునకు చట్టబద్ధత ముకుతాడు వేస్తుంది. కాగా రాష్ట్ర విభజన జరిగిన పుష్కర కాలం తర్వాత తీర్మానం చేయడం అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో ఏలికల రాజకీయ దౌర్బల్యాన్ని తెలుపుతుంది. ఇప్పటిక్కూడా 'అమరావతి' తీర్మానంలో సర్కారు స్పష్టత ఇవ్వకుండా మబ్బులో పెట్టడంతో రాష్ట్ర ప్రజలకు, రాజధాని వాసులకు, భూములిచ్చిన రైతులకు సందేహాలు తీరలేదు. ఎపి పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 సెక్షన్ 5, సబ్ సెక్షన్ 2లో 'అమరావతి వద్ద' అని చేర్చాలని, అదే సెక్షన్‌లో వివరణ కింద... మరియు అమరావతి, రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సిఆర్‌డిఎ) చట్టం 2014 నోటిఫై చేసిన నగర ప్రాంతాలు కలిగి ఉంటుంది.. అనే పదాలను పొందుపర్చాలని అసెంబ్లీ తీర్మానం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. గతంలో టిడిపి ప్రభుత్వం పేర్కొన్న కేపిటల్ సిటీ అంటే 217 చదరపు కిలోమీటర్ల పరిధిలోని తుళ్లూరు, మంగళగిరి, తాడేపల్లి మండలాల్లోని 29 గ్రామాలు మాత్రమే. ప్రస్తుత తీర్మానంలో అమరావతి అంటే సిఆర్‌డిఎ లోని ప్రాంతాలుగా పేర్కొన్నారు. ఆరు జిల్లాల్లోని 58 మండలాలు, 8,352 చదరపు కిలోమీటర్లకు విస్తరించిన సువిశాల ప్రదేశం సిఆర్‌డిఎ. మూడు నగర కార్పొరేషన్లు, పది మున్సిపాలిటీలు, వెయ్యికి పైన గ్రామ పంచాయితీల పరిధిలో అమరావతి సరిహద్దులను నిర్ధారించలేదు. గత అనుభవాల నుంచి గుణపాఠాలు నేర్వకుండా బాహుబలిని మించి డబుల్ బాహుబలి రాజధాని నిర్మాణం గురించి ప్రభుత్వం చెబుతోందని అర్థమవుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు తీర్మానం ప్రవేశపెడుతూ.. 2028 ఆగస్టు కల్లా అమరావతిని పూర్తి చేస్తామన్నారు. డెడ్‌లైన్ అయితే విధించారుకాని ఆర్థిక వనరుల గురించి పొడి పొడిగా చెప్పారు. అక్కడి నుంచి ఇక్కడి నుంచి రూ.56 వేల కోట్ల అప్పులొస్తున్నాయని లెక్కలు వల్లించారు. పునర్విభజన చట్టంలో రాజధాని నిర్మాణ బాధ్యత కేంద్రానిదని స్పష్టంగా పేర్కొన్నారు. ఈ తీర్మానంలో కేంద్రాన్ని నిధులడగడానికి సాహసించలేకపోయారు. కేవలం రుణాలతోనే రాజధానిని నిర్మిస్తే ఆ భారం ప్రజలపైనే పడుతుంది. అమరావతిని సెల్ఫ్ ఫైనాన్స్ అని ఊదరగొట్టిన టిడిపి ప్రభుత్వం, రూ. వేలు, లక్షల కోట్ల అప్పుల కోసం ఎందుకు వెంపర్లాడుతున్నదో అర్థం కాదు. పన్నెండేళ్ల క్రితం పూలింగ్‌లో భూములిచ్చిన రైతులకు ఇప్పటికీ అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇవ్వలేదు. రైతులకు కౌలు, భూములపై ఆధారపడ్డ కార్మికులకు పింఛన్ల పెంపు సహా ఇచ్చిన హామీల అమలుపై తీర్మానంలో ప్రభుత్వం తెలపకుండా, రైతులను త్యాగధనులుగా, భవిష్యత్తు కర్తలుగా పేర్కొనడం ధర్మమా! అసెంబ్లీ తీర్మానంతోనే చట్టబద్ధత రాదు. పన్నెండేళ్లుగా కేంద్రంలో బిజెపినే అధికారంలో ఉంది. రాజధాని లేని రాష్ట్రంగా అరుదైన 'ఖ్యాతి' నెలకొనడానికి కేంద్రమే అసలు కారణం. పోలవరం ప్రాజెక్టు కోసం తెలంగాణలోని ఆరు మండలాల విలీనం కోసం 2014లో మోడీ ప్రభుత్వం పునర్వ్యవస్థీకరణ చట్టానికి సవరణ చేసింది. ఆ పని చేస్తేనే తాను సిఎంగా ప్రమాణం చేస్తానన్నట్లు చంద్రబాబు చెప్పుకున్నారు. ఆనాడే అమరావతికి చట్టబద్ధత కల్పిస్తే సమస్య తలెత్తేది కాదు. తిరిగి అధికారంలోకొచ్చి రెండేళ్లవుతుందనగా, రెండు తడవలు ప్రధాని శంకుస్థాపనలు చేశాక, చట్టబద్ధత గుర్తుకురావడం వింతే! అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిశాక, ప్రోరోగ్ అయ్యాక, ప్రత్యేక అసెంబ్లీకి గురువారం గవర్నర్ నుంచి నోటిఫికేషన్, ఆ మర్నాడు కేబినెట్, ఆ వెంటనే శాసనసభలో తీర్మానం చకచక జరిగిపోవడం వెనుక తదుపరి ల్యాండ్ పూలింగ్‌ల కోసమేనన్న వాదనలకు బలం చేకూరుస్తాయి. ఏప్రిల్ ఒకటిన కేంద్ర కేబినెట్‌కు, 2న పార్లమెంట్‌లో బిల్లు కోసమేనంటున్న కూటమి నాయకుల ముక్తాయింపులు ఆచరణలో తేలుతుంది. శాసన మండలిని సమావేశపర్చకపోవడం వెలితి. వైసిపి ఐదేళ్లూ రాజధానిపై మూడు ముక్కలాడి అనిశ్చితిని కొనసాగించిన మాట నిజం. ఇప్పటికీ ఆ పార్టీ తన వైఖరి నుంచి బయటపడకపోవడం ప్రజల ఆకాంక్షలకు విరుద్ధం. ఇదే సమయంలో వైసిపిని విధ్వంసకారిగా విమర్శిస్తున్న టిడిపి కూటమి నేటికీ అమరావతిపై స్పష్టత ఇవ్వకపోవడం సబబు కాదు.

# చలికాలం మూడ్ భద్రం

## వింటర్ బ్లూస్

చలికాలం పని చేయబుద్ధి కాదు. హుషారుగా అనిపించదు. అదో వెలితిగా అనిపించే భావన. నిరాశ. ఆకలి లేకపోవడం. ఎండ, వెలుతురు లేక చిరాకు. ఇదంతా ఏదో మామూలు విషయం కాదని 'సీజనల్ ఎఫెక్టివ్ డిజార్డర్' (శాడ్) అనే ఒక విధమైన డిప్రెషన్ అని మనస్తత్వ నిపుణులు హెచ్చరిస్తున్నారు. చలికాలం వస్తే మూడ్‌ను చెక్ చేసుకుంటూ జాగ్రత్తలు తీసుకోడవం చాలా అవసరం అంటున్నారు. అసలు ఈ 'శాడ్' ఏమిటి? ఉదయాన్నే సూర్యుడి ముఖం చూసి పనిలో పడితే అదోతృప్తి. సూర్యకిరణాలు ఒంటిని తాకితే లోలోపల ఉత్తేజం. కాసింత ఎండ పొడ తగిలితే మనసంతా ఉత్సాహం. కాని చలికాలంలో వణికించే చలి ఆ అవకాశాన్ని అరుదుగా ఇస్తుంది. పొద్దున లేవగానే మంచు స్వాగతం పలుకుతుంది. రోజంతా పలుచటి వెలుతురు తప్ప సూర్యుడు అందించే ఉత్తేజం మనకు చేరదు. దాంతో ఒళ్లంతా బద్ధకంగా, మనసంతా గజిబిజిగా అనిపిస్తుంది. ఇలాంటి స్థితిని 'వింటర్ బ్లూస్' అంటుంటారు. ఇంత వరకూ మామూలే. కాని కొందరికి ఈ సమయం చాలా నిరాశ, నిర్లిప్తతలు ఆవరిస్తాయి. ఏదో కోల్పోయినట్టు, అంతా ముగిసిపోయినట్టు అనిపిస్తుంది. కొందరికి ఆకలి మందగిస్తుంది. తెలియని డిప్రెషన్ కి కొందరు లోనవుతారు. దీన్నే 'సీజనల్ ఎఫెక్టివ్ డిజార్డర్' (శాడ్) అంటున్నారు వైద్యులు. ఇలాంటి పరిస్థితిని గమనించుకుంటూ ఉండాలని హెచ్చరిస్తున్నారు.

### ఎండకు- మెదడుకు...



చలికాలం తొందరగా నిద్ర లేవాలనిపించదు. చలిలో లేచి ఏదైనా చేయాలనిపించదు. ఎనిమిది గంటలు దాటితే తప్ప సూర్యుడు తేటగా కనిపించదు. కాసింత వేడి ఒంటికి తగిలాక కొంచెం ఉత్సాహం వచ్చి పనులు మొదలుపెడతారు చాలామంది. ఇదంతా ఎందుకు? వాతావరణానికీ, మన మనసుకు మధ్య ఉండే సంబంధమే ఇందుకు కారణం అంటున్నారు మానసిక శాస్త్ర నిపుణులు. 'సూర్యుడి వెలుగు కారణంగా మెదడులో కొన్ని రసాయనాలు విడుదలవుతాయి. అవి మనలో ఉత్సాహాన్ని నింపుతాయి. చలికాలంలో ఆ చర్యలు జరగకపోవడం వల్ల నిస్సారంగా, బద్ధకంగా అనిపిస్తుంది' అని వివరిస్తున్నారు.

### చలికాలమే మేలు అనుకుంటారా?

ఎండాకాలం తట్టుకోలేనంత వేడి ఉంటుంది. చలికాలం వస్తే బాగుండని ఆ వేడి తట్టుకోలేక కొందరు అనుకుంటారు. కానీ కొందరికి మాత్రం చలికాలం నచ్చదు. రోజంతా ఉత్సాహం లేని పనులు చేస్తూ, గంటల కొద్దీ ఒకేచోట గడుపుతూ ఉంటారు. ఈ సమయంలో ఒంట్లో సెరటోనిన్, మెలటోనిన్ రసాయనాలు విడుదల కాకపోవడమే ఇందుకు కారణమంటున్నారు వైద్యులు. సూర్యరశ్మి తక్కువగా ఉండటం కూడా దీనికి తోడై డిప్రెషన్ లోకి నెట్టేస్తుందని అంటున్నారు. అందుకే చలికాలం అనగానే కొందరిలో ఆనందం మాయమైపోతుంది. సంతోషం దూరమవుతుంది. ఏ పనీ చేసేందుకుఆసక్తిరాక మిన్నకుండి పోతుంటారు.

### దీన్ని గుర్తించేదెలా?

'సీజనల్ ఎఫెక్టివ్ డిజార్డర్' అందరిలో ఉంటుందని చెప్పలేం. ఒకవేళ ఉన్నా, దాన్ని గుర్తించడం కష్టం. అత్యల్ప ఉష్ణోగ్రతలు కలిగిన దేశాల్లో చాలామంది దీని బారిన పడుతున్నారు. ఇటువంటి వారు తొందరగా డిప్రెషన్ లోకి వెళ్లిపోతున్నారు. తమకున్నది 'సీజనల్ ఎఫెక్టివ్ డిజార్డర్' అన్న విషయం కూడా వారికి తెలియడం లేదు. కొందరు ఈ డిప్రెషన్ నుంచి బయట పడేందుకు అధికంగా తినడం, దురలవాట్లకు లోనవడం వంటివి చేస్తున్నారు. దీంతో ఆ ప్రభావం అంతా వారి ఆరోగ్యం మీద పడి తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.

### శాడ్ లక్షణాలు...

**రోజువారి పనుల్లో ఆసక్తి కోల్పోవడం**

**నిరాశ ఏకాగ్రత కోల్పోవడం**

**ఒంటరితనం, ఏకాంతం ఇష్టపడటం**

**నిద్రలేమి, అలసట (లేదా) అధిక నిద్ర, అధిక తిండి**

**నలుగురిలో కలవకపోవడం**

### ఏమిటి పరిష్కారం?

చలికాలంలో రోజూ పొద్దున్నే లేచి వ్యాయామం, యోగా చేయడం ఉత్తమమైన మార్గం. దీని వల్ల శరీరానికి ఉల్లాసంగా అనిపించడంతోపాటు మానసికంగా ఏదో ఒక పని చేయాలన్న సంసిద్ధత ఏర్పడుతుంది. ఎక్కువ సేపు ఒకే చోట కూర్చుని పనిచేయకుండా రకరకాల పనులపై దృష్టి నిలపడం మరో పరిష్కారం. డిప్రెషన్ భావన వచ్చినప్పుడు ఆత్మీయులతో మాట్లాడటం, సంగీతం వినడం, డ్యాన్స్ చేయడం వంటివి మనసును తేలికపరుస్తాయని అంటున్నారు. చలికాలాన్ని ప్రకృతి సహజమైన విషయంగా భావించి, మనసు దృఢ పరుచుకుంటే మానసికంగా బలవంతులు అవుతారని వైద్యులు సూచిస్తున్నారు.

# గూగుల్ ప్లేలో బెస్ట్ యాప్‌లు ఇవే..




టెక్నాలజీ పెరిగి స్మార్ట్ ఫోన్ అందుబాటులోకి వచ్చాక అన్నీ సులభమైపోయాయి. ప్రతి అంశానికీ, పనికీ పదుల సంఖ్యలో మొబైల్ యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి.. వస్తున్నాయి. ఇలా వేలకొద్దీ యాప్‌లు ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లకు సేవలు అందిస్తున్నాయి. ఈ క్రమంలో ఆండ్రాయిడ్ యాప్ స్టోర్ అయిన గూగుల్ ప్లే 2025 ఏడాదికిగానూ ఉత్తమ యాప్‌లను ప్రకటించింది. గూగుల్ ప్లే యాప్ స్టోర్‌లో 2025లో అందుబాటులో ఉన్న యాప్‌లలో గేమ్స్, పర్సనల్ గ్రోత్, ఎవ్రీడే ఎషన్షియల్.. ఇలా ఒక్కో అంశానికీ కొన్ని ఉత్తమ యాప్‌లను పేర్కొంటూ జాబితాను విడుదల చేసింది. వీటిలో ఏఐ అనుసంధానిత యాప్‌లదే పైచేయి. ఉదాహరణకు ఓవరాల్ బెస్ట్ యాప్‌గా జొమాటోకు చెందిన సోషల్ యుటిలిటీ యాప్ 'డిస్ట్రిక్ట్' నిలిచింది. ఇది ఏఐని వినియోగించి వినియోగదారుల అభిరుచులను విశ్లేషించి డైనింగ్‌తో పాటు ఈవెంట్లు, సినిమా టికెట్ల బుకింగ్ వంటి సోషల్ యుటిలిటీ సేవలు రియల్ టైమ్ సమాచారంతో అందిస్తోంది. ఇక పర్సనల్ గ్రోత్ విభాగంలో 'ఇన్‌వీడియో ఏఐ' అత్యుత్తమ యాప్‌గా నిలిచింది. దీంతో టెక్స్ట్ రూపంలో ప్రాంప్ట్ ఇచ్చి నేరుగా మంచి మంచి వీడియోలు రూపొందించవచ్చు. బెస్ట్ హిడెన్ జెమ్‌గా టూన్‌సూత్ర అనే యాప్‌ను గూగుల్ ప్లే పేర్కొంది. ఇది ఏఐ-ఆధారిత సినిమాటిక్ మోడ్ ను ఉపయోగించి భారతీయ ప్రసిద్ధ కథలను డిజిటల్ ఎక్స్‌పీరియన్స్‌తో ఆసక్తికరంగా మారుస్తుంది. ఫోటో ఎడిటింగ్, నోట్స్ రూపొందించడం వంటి వాటిలో సాయమందించే గుడ్ నోట్స్, లుమినార్ యాప్‌లు ఉత్పాదకత విభాగంలో ఉత్తమంగా నిలిచాయి. ఇవి ఏఐ ఫీచర్లతో ఫొటో ఎడిటింగ్, నోట్స్ టేకింగ్‌ను సులభతరం చేస్తున్నాయి. వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణ, జీవనశైలికి సంబంధించిన అంశాల్లోనూ కొన్ని యాప్‌లు ఏఐ వినియోగాన్ని విస్తరిస్తున్నాయి. అలాంటివాటిలో ఉత్తమమైనవే డైలీప్లానర్, స్లీపిసోల్‌బయో యాప్‌లు. ఇక గేమింగ్ విషయానికి వస్తే లెక్కలేనన్నీ ఆండ్రాయిడ్ యాప్‌లో అందుబాటులో ఉన్నాయి. అయితే వాటిలో ఏఐ ఫీచర్లతో లోకల్ ఫ్లేవర్ జోడించిన యాప్‌లకు మంచి ఆదరణ ఉంటోంది. అలాంటి యాప్‌లే కుకీరన్ ఇండియా, కమలా, రియల్ క్రికెట్ స్వప్ వంటివి. గూగుల్ కొత్తగా టాప్ ట్రెండింగ్ కేటగిరీని కూడా ప్రవేశపెట్టింది. ఇందులో ఇన్‌స్టామార్ట్, సీఖో, అడోబ్ ఫైర్ ఫ్లై వంటి యాప్‌లు బెస్ట్‌గా నిలిచాయి. ఆవిష్కరణ, నాణ్యత, యూజర్ ఇంపాక్ట్, సాంస్కృతిక ఔచిత్యం, ఏఐ-ఆధారిత ఎక్స్‌పీరియన్స్ ఆధారంగా ఈ బెస్ట్ యాప్‌లను గూగుల్ ప్లే ఎంపిక చేసింది. రోజువారీ ఉపయోగం, స్థానికతను జోడించడం, వివిధ రకాల ఫోన్లు, డివైజ్‌లలో వినియోగించగల వెసులుబాటు ఉన్న యాప్‌లను హైలైట్ చేసింది. వాస్తవానికి, 69 శాతం మంది భారతీయ యూజర్లు ఏఐతో తమ మొదటి ఎక్స్‌పీరియన్స్ ఆండ్రాయిడ్ యాప్‌ల ద్వారానే పొందుతున్నారని గూగుల్ తన బ్లాగ్‌లో పేర్కొంది.

# డేటా సెంటర్ల ఏర్పాటులో సవాళ్లు.. భారత్ ఏం చేయాలంటే..

సముద్ర గర్భంలో కేబుళ్ల ద్వారా నిమిషాల వ్యవధిలో పెద్దమొత్తంలో సమాచారాన్ని ప్రపంచం నలుమూలలా చేరవేసే శక్తిమంతమైన కేంద్రాల గురించి మీరు ఎప్పుడైనా ఆలోచించారా? అవును.. అవే డేటా సెంటర్లు. డేటా సెంటర్లు డిజిటల్ స్టోరేజ్ కోసం ప్రాసెసింగ్ హౌస్‌లుగా పని చేస్తాయి. మనం ఆన్‌లైన్‌లో చేసే ప్రతి పనికి (ఉదాహరణకు, గూగుల్‌లో శోధించడం, యూట్యూబ్ వీడియో చూడటం, జీమెయిల్ పంపడం, ఫొటోను క్లౌడ్‌లో సేవ్ చేయడం లేదా ఆన్‌లైన్ గేమ్ ఆడటం) మూల కారణం డేటా సెంటర్లే. ఈ విభాగంలో టెక్నాలజీ దిగ్గజాలైన గూగుల్, అమెజాన్, మైక్రోసాఫ్ట్.. వంటి అంతర్జాతీయ సంస్థలు ఇప్పుడు తమ దృష్టిని భారత్‌పై కేంద్రీకరించాయి. భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టి దేశంలో డేటా సెంటర్ల నిర్మాణానికి సిద్ధమవుతున్నాయి. ఇదొకవైపు డిజిటల్ ఇండియాకు శుభపరిణామం అయినప్పటికీ, మరోవైపు దేశ ఇంధన భవిష్యత్తుకు పెద్ద సవాలుగా పరిణమిస్తుందనే వాదనలున్నాయి.

### భారత్ ఎందుకు?

భారత్‌లో డేటా సెంటర్లను ఏర్పాటు చేయడానికి అంతర్జాతీయ కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. ఇండియా ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న డిజిటల్ మార్కెట్‌గా ఉంది. కోట్లాది మంది ఇంటర్నెట్ యూజర్లు, పెరుగుతున్న 5జీ విస్తరణ, యూపీఐ లావాదేవీలు, ఓటీటీ వినియోగం విపరీతంగా పెరిగింది. ఈ భారీ డేటా డిమాండ్‌ను తీర్చాలంటే వినియోగదారులకు తక్కువ లేటెన్సీ అంటే వేగవంతమైన సేవలు కల్పించాలంటే డేటా సర్వర్లు భౌగోళికంగా వారికి చేరువలో ఉండాలి. భారత ప్రభుత్వ చట్టాల ప్రకారం దేశానికి సంబంధించిన సున్నిత డేటాను దేశ సరిహద్దుల్లోనే నిల్వ చేయాలని అంతర్జాతీయ కంపెనీలకు నిర్దేశిస్తున్నాయి. ఇది ఆయా కంపెనీలకు దేశంలోనే డేటా సెంటర్లను స్థాపించేందుకు సిద్ధపడేలా చేస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డేటా సెంటర్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు, సులభతరమైన అనుమతులు కల్పిస్తున్నాయి. భారత్‌లో నైపుణ్యం కలిగిన ఇంజినీర్లు, సాంకేతిక నిపుణుల లభ్యత ఇందుకు సానుకూల అంశంగా ఉంది.

### డేటా సెంటర్లకు ఎంత విద్యుత్ కావాలంటే..

డేటా సెంటర్లకు తరచుగా భారీగా విద్యుత్ అవసరం అవుతుంది. దీనికి కారణం వాటిలో నిరంతరం 24/7 పనిచేసే వేలాది సర్వర్లు (కంప్యూటర్లు) ఉంటాయి. డేటాను ప్రాసెస్ చేయడం, నిల్వ చేయడం, బదిలీ చేయడం వంటి నిరంతర కార్యకలాపాల కోసం ప్రతి సర్వర్‌కు గణనీయమైన విద్యుత్ అవసరం అవుతుంది. ఈ ప్రక్రియలో సర్వర్లన్నీ అధిక మొత్తంలో ఉష్ణాన్ని ఉత్పత్తి చేస్తాయి. వేడి పెరిగితే సర్వర్లు దెబ్బతినే ప్రమాదం ఉంది. కాబట్టి, సర్వర్లను సరైన ఉష్ణోగ్రత వద్ద ఉంచడానికి భారీ స్థాయిలో కూలింగ్ వ్యవస్థలు పనిచేయాలి. నివేదికల ప్రకారం, ఒక డేటా సెంటర్‌లోని మొత్తం విద్యుత్ వినియోగంలో సుమారు 40% వరకు కేవలం కూలింగ్ కోసమే ఖర్చు అవుతుంది.

### ఉష్ణోగ్రత నియంత్రణ ఎలా?

సర్వర్లలో ఉత్పత్తి అయ్యే అధిక వేడిని తగ్గించడానికి ప్రపంచవ్యాప్తంగా వివిధ సాంకేతికతలను ఉపయోగిస్తున్నారు. కంప్యూటర్ రూమ్ ఎయిర్ కండిషనింగ్/హ్యాండ్లర్ యూనిట్లను ఉపయోగించి సర్వర్ల చుట్టూ ఉన్న గాలిని చల్లబరుస్తారు. ఇది అత్యంత సాధారణ పద్ధతి. నీటిని ఆవిరి చేసి దాని ద్వారా ఉత్పత్తయ్యే చల్లదనాన్ని ఉపయోగించి వేడి గాలిని చల్లబరచడం ఇంకోపద్ధతి. వేడి వాతావరణం ఉన్న భారత్ వంటి దేశాలకు ఇది మెరుగైన మార్గం అవుతుంది. లిక్విడ్ కూలింగ్ అనేది ఆధునిక పద్ధతి. సర్వర్ చిప్‌లకు నేరుగా ప్రత్యేకమైన ద్రవాలను పంపడం ద్వారా వేడిని తొలగిస్తారు. దీనివల్ల విద్యుత్ వినియోగం తగ్గుతుంది. చాలా కంపెనీలు డేటా సెంటర్ల నుంచి వచ్చే వేడి నీటిని సమీపంలోని పారిశ్రామిక అవసరాలకు మళ్లిస్తున్నారు.

### ఇంధన సవాళ్లు..

భారతదేశం 2070 నాటికి 'నికర-శూన్య కర్బన ఉద్గారాల' లక్ష్యాన్ని సాధించాలని, 2030 నాటికి స్థాపిత విద్యుత్ సామర్థ్యంలో 50% పునరుత్పాదక వనరుల నుంచి దీన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. భారత్‌లో ప్రస్తుతం అధిక విద్యుత్ ఉత్పత్తికి ప్రధాన ఆధారం థర్మల్ విద్యుత్ (బొగ్గు). డేటా సెంటర్ల కోసం విపరీతంగా పెరిగే విద్యుత్ డిమాండ్‌ను తీర్చడానికి ప్రభుత్వం మళ్లీ థర్మల్ విద్యుత్‌పై ఆధారపడాల్సి వస్తే అది మన పునరుత్పాదక లక్ష్యాలను దెబ్బతీస్తుంది. కార్బన్ ఉద్గారాలు పెరిగి పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతుంది.



### భారత్ ఎంచుకోవాల్సిన పంథా..

ఈ సంక్లిష్ట సమస్యను పరిష్కరించడానికి భారతదేశం ఒక సమగ్రమైన, పర్యావరణ అనుకూల విధానాన్ని అనుసరించాలి. భారత ప్రభుత్వం 'గ్రీన్ డేటా సెంటర్' విధానాన్ని ప్రవేశపెట్టాలి. డేటా సెంటర్ ఆపరేటర్లు తమకు అవసరమైన విద్యుత్‌లో కనీసం 60% పునరుత్పాదక ఇంధన వనరుల నుంచి పొందాలని (ఉదాహరణకు, సోలార్ లేదా విండ్ పవర్ ప్లాంట్‌లతో పవర్ పర్చేజ్ అగ్రిమెంట్స్) తప్పనిసరి చేయాలి. విద్యుత్ వినియోగ సమర్థత వంటి పారామితుల ఆధారంగా ప్రోత్సాహకాలు ఇవ్వాలి. లిక్విడ్ కూలింగ్, నేచురల్ ఎయిర్ కూలింగ్ (చల్లని ప్రాంతాల్లో) వంటి అత్యంత సమర్థవంతమైన కూలింగ్ సాంకేతికతలను ఉపయోగించే డేటా సెంటర్లకు అధిక రాయితీలు ఇవ్వాలి. విద్యుత్‌ను వృథా చేసే వ్యవస్థలకు బదులుగా ఆధునిక, పర్యావరణ అనుకూల యంత్రాలను ఉపయోగిస్తే కొన్ని రాయితీలు పరిశీలించవచ్చు. సౌర, పవన విద్యుత్ నిరంతరంగా లభించదు. కాబట్టి, ఈ విద్యుత్‌ను నిల్వ చేయడానికి బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ వంటి సాంకేతికతలపై పెట్టుబడులు పెంచాలి. ఇది డేటా సెంటర్లకు నిరంతరాయంగా పునరుత్పాదక విద్యుత్తును సరఫరా చేయడానికి దోహదపడుతుంది.

# 'స్పాట్' పెట్టిందో సఫా..!




దాని పేరు స్పాట్.. బరువు దాదాపు ఒక జర్మన్ షెపర్డ్ కుక్కతో సమానం. అయితే ఇది కేవలం డాన్స్ వీడియోలతో వైరలైన రోబో శునకం కాదుసుమా.. ప్రస్తుతం ఇది అమెరికా, కెనడాలోని 60కి పైగా పోలీసు విభాగాలలో, అత్యంత ప్రమాదకరమైన మిషన్లలోకి దూసుకుపోతోంది. దీనిధర వింటే కళ్లు బైర్లు కమ్ముతాయి: ప్రాథమిక యూనిట్ ధర దాదాపు రూ.90 లక్షలు (100,000 డాలర్లు). అధునాతన అదనపు పరికరాలతో కలిపి ఇది రూ.2.2 కోట్లు (250,000 డాలర్లు) దాటిపోతుంది.

### ప్రాణాపాయ మిషన్లలోకి ప్రవేశం

అయిదేళ్ల క్రితం ఆవిష్కరించిన ఈ నాలుగు కాళ్ల రోబో, ఇప్పుడు పోలీసుల అత్యవసర ఆపరేషన్లలో కీలకంగా మారింది. మానవ ప్రాణాలను పణంగా పెట్టాల్సిన చోట, స్పాట్ ముందుంటుంది. ప్రమాదకరమైన వస్తువులను తనిఖీ చేయడానికి, సాయుధ గ్యాంగ్‌స్టర్‌ల మధ్య చిక్కుకున్న బందీల రక్షణలో, రసాయనాలు చిందటం లేదా ప్రమాదకరమైన ప్రదేశాల సర్వేల్లో దీని సేవలు అపారం. ఒక హొస్టేజ్ రెస్క్యూ మిషన్ గురించి మసాచుసెట్స్ స్టేట్ పోలీస్‌కు చెందిన ట్రూపర్ జాన్ రగోసా చెబుతూ, 'స్పాట్ ఒక ఆ దుండగుడిని ఎదుర్కొన్నప్పుడు, 'ఏంటీ కుక్క?' అంటూ అవాక్కయ్యాడు'.. అని తెలిపారు.

### 'స్పాట్' ఏం చేయగలదంటే..



'స్పాట్'ను ఒక టాబ్లెట్ కన్సోల్ ద్వారా నియంత్రించవచ్చు. ఈ రోబో సామర్థ్యాలు సంప్రదాయ చక్రాల రోబోల కంటే ఎంతో మెరుగ్గా ఉన్నాయి. ఎగిరి దూకడం, మెట్లు ఎక్కడం, జారే ఉపరితలాలపై నడవడం. మల్టిపుల్ కెమెరాల నుండి లైవ్ వీడియో స్ట్రీమ్ పంపడం, ఆటోమేటిక్‌గా అడ్డంకులను గుర్తించి, దారి మళ్లడం లాంటి సవాళ్లను అవలీలగా ఎదుర్కొంటుంది. తాళం వేసిన తలుపులను కూడా తెరవగలుగుంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 2,000 స్పాట్ రోబోలు పనిచేస్తుండగా, భద్రతా ఏజెన్సీల నుండి డిమాండ్ అనూహ్యంగా పెరిగిందని బోస్టన్ డైనమిక్స్ వైస్ ప్రెసిడెంట్ బ్రెండన్ షుల్మాన్ తెలిపారు.

### పోలీసు ప్రపంచానికి పెద్ద అండ

చివరికి, డ్యాన్స్ వీడియోలతో ప్రపంచాన్ని నవ్వించిన ఈ రోబో, ఇప్పుడు ఆధునిక పోలీసు వ్యవస్థ సంక్లిష్ట ప్రపంచంలోకి దూసుకుపోతూ, ఆవి ష్కరణకు, వివాదా నికి మధ్య నిలుస్తోంది. రూ.90 లక్షల ఈ 'రోబో డాగ్' భవి ష్యత్తు పోలీసు ప్రపంచాన్ని పూర్తిగా మార్చబోతోందనేది మాత్రం నిస్సందేహం.

### అంతులేని ప్రశ్నలు.. ఆందోళనలు

స్పాట్ ప్రవేశంతో సాంకేతికత ఎంత ఆశ కలిగిస్తోందో, అంతకు మించిన ప్రశ్నలు, భయాలు రేకెత్తుతున్నాయి. ఇది కేవలం సాంకేతిక ఆవిష్కరణ మాత్రమే కాదు, పోలీసు వ్యవస్థలో ఒక కొత్త శకానికి సంకేతం. న్యూయార్క్ పోలీసులు 2021లో స్పాట్‌ను ఉపయోగించడంపై నిరసనలు వెల్లువెత్తాయి. దాని అధిక ధర, నిఘా పాత్రపై ప్రజలు ఆందోళన చెందారు. నిరసనల కారణంగా తాత్కాలికంగా ఆపినా, తర్వాత కొత్తగా రెండు యూనిట్లు కొనుగోలు చేశారు. టెక్సాస్ ఏ అండ్ ఎం ప్రొఫెసర్ రాబిన్ మర్ఫీ మాట్లాడుతూ.. స్పాట్ చురుకుదనం గొప్పదే అయినా, రోబోటిక్ సాధనాల వాడకం పెరిగితే పోలీసులు ప్రజల నుండి మరింత దూరం అవుతారన్నారు. యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ ప్రొఫెసర్ ర్యాన్ కాలో మాట్లాడుతూ.. 'అధికారులు ప్రాణాలను పణంగా పెట్టకూడదు, కానీ మనం రోబోటిక్ పోలీసు రాజ్యంగా మారకూడదు'.. అని హెచ్చరించారు.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .